E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com



ఆధార్‌ను 12వ నిర్ణీత పత్రంగా చేర్చండి » 3లో

(తేదీ) 09-09-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



## స్వదేశీ మేళాకు పట్టం కట్టండి

» ట్రంప్ సుంకాల వేళ ఎన్‌డీఏ ఎంపీలకు మోదీ ఉద్బోధ

» ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్తగా ఓటేయాలని సూచన

తరువాయి 2లో

# నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక




- అన్ని ఏర్పాట్లు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఎన్డీఏ వర్సెస్ ఇండియా కూటమి
- సీపీ రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిల మధ్య ముఖాముఖి పోటీ
- ఓటింగ్‌లో పాల్గొననున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు
- ఉదయం 10 గంటలకు పోలింగ్ షురూ..
- 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు..తర్వాత వెలువడనున్న ఫలితం
- బలాబలాల పరంగా ఎన్డీఏ అభ్యర్థికి పూర్తి మెజార్టీ
- మాక్ పోలింగ్‌లు, ఎంపీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పార్టీలు


ఈకబురు, న్యూఢిల్లీ: దేశ తదుపరి ఉప రాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆరోగ్య కారణాలరీత్యా జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ పదవికి మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంటు భవనంలో పోలింగ్ ప్రక్రియ సాగనుండగా.. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ పక్షాల అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మధ్య ముఖాముఖి పోటీ జరగనుంది. అభ్యర్థులిద్దరూ తమకు మద్దతు కోరుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఆయా పార్టీలు సోమవారం వేర్వేరుగా మాక్ పోలింగ్‌ను నిర్వహించాయి. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ఓటింగ్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. పార్లమెంట్ హౌస్ వసుధలోని రూమ్ నంబర్ ఎఫ్-101లో పోలింగ్ జరగనుంది. 6 గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితం వెల్లడి కానుంది. ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు (ప్రస్తుతం ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి), రాజ్యసభకు నామినేటెడ్ అయిన 12 మంది, లోక్‌సభ ఎంపీలు 543 మంది (ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది) ఎలక్టోరల్ కాలేజీలో సభ్యులుగా ఉన్నారు.

తరువాయి 2లో

పాత స్టాక్ పైనా డిస్కౌంట్! » 4లో



డీమన్ స్లేయర్ స్క్రీనింగ్‌లో రష్మిక హంగామా » 5లో



ఏఆర్ రెహమాన్ కోసం రూ.70 లక్షలు వదులుకొన్న శ్రీదేవి » 5లో



ఐసీసీ అవార్డు రేసులో సిరాజ్ » 6లో





## సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని ఎత్తివేసిన నేపాల్

తరువాయి 2లో



## సత్వరమే తుమ్మిడిహెట్టికి డీపీఆర్

తరువాయి 3లో



## ఆ రెండు శాఖల్లోనే ఆదాయం పెరిగిందా!

» మిగిలిన శాఖల ఆదాయం పరిస్థితేంటి?

» ఉన్నతాధికారులను ప్రశ్నించిన మంత్రివర్గ ఉపసంఘం

ఈకబురు, హైదరాబాద్: 'వాణిజ్య పన్నుల్లో 4.7 శాతం, గనుల శాఖలో 18.6 శాతం మేరకు ఆదాయం పెరుగుదల కనిపిస్తోంది. మరి ఇతర ఆదాయార్జన శాఖల మాటేమిటి? ఎందుకు ఆయా శాఖలు ఆదాయ సమీకరణలో వెనుకబడ్డాయి?'అని ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఉన్నతాధికారులను ప్రశ్నించింది. మిగిలిన శాఖల్లో కూడా ఆదాయం పెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలకు ఉపక్రమించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని ఆదేశించింది.

సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తద్వారా ప్రాజెక్టుల్లో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందని, ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందని అన్నారు.

తరువాయి2లో

## మూసీ పునరుజ్జీవం.. చేసి చూపిస్తాం



» దేళ్ల పాలనలో హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకురావాలన్న ఆలోచనే.. బీఆర్ఎస్‌కు రాలేదు

» తాటిచెట్టంత మనిషి.. మెదడు మోకాలులోనూ లేదు

» ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తాగునీరు

» అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టే

» ప్రాణహిత-చేవెళ్లలోనూ మల్లన్నసాగర్ ప్రతిపాదన ఉంది

» కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులను ఆపొద్దు

» విపక్ష నేతల కుట్రలు తిప్పికొడతాం.. సంగతి తేలుస్తాం

» ప్రతిపక్షాలు అభివృద్ధిలో కలిసి రావాలి: సీఎం రేవంత్

» గోదావరి ఫేజ్- 2, 3, మూసీ ప్రాజెక్టులకు శంకుస్థాపన'

ఈకబురు, ఎవరు అడ్డం పడినా.. అడ్డంకులు సృష్టించినా.. కుట్రలు, కుతంత్రాలు చేసినా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గుజరాత్‌లో మోదీ ఆధ్వర్యంలో సబర్మతి నది, యూపీలో యోగి నేతృత్వంలో గంగా నది, ఢిల్లీలో రేఖా గుప్తా నాయకత్వంలో యమునా నది తీరప్రాంత అభివృద్ధి పనులు చేపట్టారని, 4 కోట్ల ప్రజలు ఉన్న తెలంగాణలో మూసీ తీర ప్రాంత అభివృద్ధి జరగొద్దా? అని ప్రశ్నించారు. రూ.7,360కోట్లతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు సోమవారం గండిపేట వద్ద రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ నిజాం పాలకుల దూర దృష్టి వల్లే హైదరాబాద్‌కు ముంపు ముప్పు, తాగు నీటి సమస్యలకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. 1920, 1922లో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల నిర్మాణం పూర్తయితే.. వందేళ్లుగా హైదరాబాద్ దాహార్తి తీరుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు మంజీరా, కృష్ణా, గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. గతంలో సచివాలయం ముందు ఖాళీ బిందెలు, కుండల ప్రదర్శనలు జరిగేవని, అలాంటి ఇబ్బందులన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే పరిష్కారం చూపిందన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచే హైదరాబాద్‌కు నీటి సరఫరా జరుగుతోందని, అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిందేనని పేర్కొన్నారు.

తరువాయి2లో

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

» పలు జిల్లాల్లో వారికి తప్పని తిప్పలు

» బస్తా యూరియా ఎలా సరిపోతుందంటూ ఆగ్రహం



ఈకబురు, రెబ్బెన, కోటపల్లి, చెన్నూరు పట్టణం, నర్సింహులపేట, కురవి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యూరియా కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. సరిపడా యూరియా దొరక్కపోవడంతో అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. టోకెన్లు ఇచ్చి నెలరోజులు కావస్తున్నా యూరియా ఇవ్వడం లేదని, వచ్చినా సకాలంలో పంపిణీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కుమురంభీం జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. సోమవారం రెబ్బెన పీఏసీఎస్ కార్యాలయానికి 440 బస్తాలతో ఒక లారీ లోడ్ వచ్చింది. అప్పటికే వివిధ గ్రామాలకు చెందిన సుమారు 200 మంది అక్కడ పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 11 గంటలు దాటినా సంఘం ఇన్‌ఛార్జి సీఈవో శేషారావు రాకపోవడంతో లోడ్ దింపలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు.. జాతీయ రహదారితోపాటు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లనూ దిగ్బంధం చేశారు. కొందరు రైతులు బస్సు కింద పడుకొని నిరసన తెలిపారు. రెబ్బెన సీఐ ఎం .సంజయ్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పే క్రమంలో యూరియా ఇప్పించాలని ఓ రైతు ఆయన కాళ్లు పట్టుకొని వేడుకున్నారు. అధికారులతో మాట్లాడి పంపిణీ చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఒక్క బస్తా ఇస్తే పంటలను ఎలా కాపాడుకోవాలి..

తరువాయి2లో

## జీఎస్‌డీపీ రూ.14.56 లక్షల కోట్లు

» రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణాంకాలను వెల్లడించిన ఆర్‌బీఐ

» 2024–25 ఆర్థిక సంవత్సరంలో పెరిగిన తెలంగాణ ఆర్థిక పరపతి

» 2023–24తో పోలిస్తే రూ.1.3 లక్షల కోట్లు పెరిగిన జీఎస్‌డీపీ

» రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మూడు రెట్లు పెరిగిన ఎస్ఎస్‌డీపీ

» 2లో



ఈ-కబురు

09-09-2025
మంగళవారం
e-kaburu.com

మొదటి పేజి తరువాయి

# నేడే ఉప రాష్ట్రపతి ఎన్నిక

ఎన్డీఏకు సొంతంగా 422 మంది సభ్యుల బలం

ఎలక్టోరల్ కాలేజీలోని బలాబలాల పరంగా చూస్తే ఎన్డీఏకు స్పష్టమైన మెజార్టీ ఉంది. ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 781 మంది సభ్యులున్నారు. ప్రస్తుతం 542 మంది సభ్యులున్న లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి 293 మంది సభ్యుల బలం ఉంది. ఇక 239 మంది సభ్యులున్న రాజ్యసభలో పాలక కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉంది. విజయానికి అవసరమైన ఓట్లు 391 కాగా, ఎన్డీఏకు సొంతంగానే 422 మంది సభ్యుల బలం ఉంది. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం తమ 11 మంది సభ్యుల మద్దతు ఎన్డీఏ అభ్యర్థికి ప్రకటించడంతో ఆ సంఖ్య 433కి చేరనుంది. ఇక విపక్ష ఇండియా కూటమికి రెండుసభల్లో కలిపి 311 ఓట్లు ఉండగా, ఈ కూటమికి ఆప్ మద్దతు ప్రకటించింది. దీంతో కూటమి బలం 320 మాత్రమే దాటుతోంది. అయితే రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలో ఎంపీలు తమ పార్టీల విప్‌ను పాటించాల్సిన అవసరం లేదు.

అన్ని పార్టీల మాక్ పోలింగ్..

పార్టీల బలాబలాలపై ఇరు పక్షాలకు స్పష్టత ఉన్నప్పటికీ ఓట్లు చెల్లుబాటు కాకుండా పోవడంపై ఆందోళన, క్రాస్ ఓటింగ్ భయం రెండు కూటముల్లోనూ కనిపిస్తోంది. 2022 ఎన్నికల్లో 15 ఓట్లు చెల్లకుండా పోవడంతో ఈసారి పార్టీలు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ తమ ఎంపీల కోసం ఆది, సోమవారాల్లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీ పాత పార్లమెంట్ భవనం సెంట్రల్‌హాల్‌లో మాక్ పోలింగ్ ద్వారా తమ ఎంపీలకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విపక్ష ఎంపీలకు విందు ఇచ్చారు. సంవిధాన్ సదన్‌లో జరిగిన సమావేశంలో ఖర్గేతో పాటు సోనియాగాంధీ, శరద్‌పవార్, టీఆర్ బాలు, అఖిలేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సైతం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి నివాసంలో ఎంపీలతో మాక్ పోలింగ్ నిర్వహించింది.

ఎన్డీఏ ఎంపీలతో మోదీ సమావేశం

మంగళవారం ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం..'రాధాకృష్ణన్ అద్భుతమైన ఉప రాష్ట్రపతి అవుతారని ప్రజలు విశ్వసిస్తున్నారు..'అంటూ 'ఎక్స్'లో ఒక పోస్టు చేశారు. కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ మచ్చలేని నేతగా అభివర్ణిస్తోంది. రాజకీయ, పాలనాపరమైన ఆయన విశేష అనుభవం..రాజ్యసభ చైర్మన్‌గా విధులు నిర్వర్తించేందుకు ఉపకరిస్తుందని పేర్కొంటోంది. ఇక విపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి 2011లో సుప్రీంకోర్టులో పదవీ విరమణ పొందారు. నల్లధనం, సల్వాజుడుం తదితర కేసుల్లో కీలక తీర్పులు వెలువరించారు.

బీఆర్ఎస్, బీజేడీ దూరం

రెండు కూటములకు సమాన దూరాన్ని పాటిస్తూ వస్తున్న బీఆర్ఎస్, బీజేడీలు ప్రస్తుత ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉంటామని ఇప్పటికే ప్రకటించాయి. ప్రస్తుతం రాజ్యసభలో బీఆర్ఎస్‌కు నలుగురు, బీజేడీకి ఏడుగురు సభ్యుల బలం ఉంది.

మొదటి పేజి తరువాయి

## సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని ఎత్తివేసిన నేపాల్

ఈకబురు, నేపాల్ లో సామాజిక మాధ్యమాలపై నిషేధం విధింపుపై నేపథ్యంలో చేపట్టిన ఆందోళన తీవ్ర హింసకు దారితీయడంతో ఆ దేశ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాజిక మాధ్యమాలపై విధించిన నిషేధం ఎత్తివేస్తున్నట్లు నేపాల్ సోమవారం ప్రకటించింది. ప్రధాని కేపీ శర్మ ఓలీ నేతృత్వంలో సోమవారం రాత్రి క్యాబినెట్ అత్యవసర భేటీ జరిగింది. ఈ సమావేశంలో సోషల్ మీడియాపై విధించిన బ్యాన్‌ను ఎత్తివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం ఆ దేశ కమ్యూనికేషన్, సమాచార, ప్రసార శాఖ మంత్రి పృథ్వీ సుబా గురుంగ్ నిషేధం ఎత్తివేస్తున్నట్లు ప్రకటన చేశారు. 'జనరేషన్ జడ్' డిమాండ్ మేరకు సోషల్ మీడియా సైట్లను తిరిగి ప్రారంభించేందుకు సమాచార మంత్రిత్వ శాఖ సంబంధిత ఏజెన్సీలను సంప్రదించినట్లు వెల్లడించారు. మంత్రి ప్రకటన నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్), వాట్సప్ తదితర సైట్లు పనిచేయడం ప్రారంభించాయి. ప్రభుత్వం నిర్ణయం నేపథ్యంలో ఆందోళనకారులు నిరసన విరమించాలని మంత్రి కోరారు. నేపాల్‌లో 19మంది నిరసనకారుల మృతి.. హోంమంత్రి రాజీనామాగడువు లోపల కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక శాఖ వద్ద రిజిస్టర్ కానందుకు ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, యూట్యూబ్, ఎక్స్, రెడిట్, లింక్డిన్ వంటి సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం గత గురువారం నిషేధం విధించింది. ఈ మాధ్యమాలు ఆగస్టు 28 నుంచి ఏడురోజుల్లోగా రిజిస్టర్ కావలసి ఉంది. ఈ గడువు బుధవారం రాత్రి తీరిపోయినా అవి రిజిస్టర్ కాలేదు. దీంతో మూడు రోజుల క్రితం నేపాల్ ప్రభుత్వం 26 సోషల్ మీడియా సైట్లపై నిషేధం విధించింది. ఈ చర్యతో పాటు ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై అక్కడి యువత రాజధాని కాఠ్‌మాండూతో పలు పట్టణాల్లో భారీ ఆందోళన చేపట్టింది. ఆందోళనకారులు నేపాల్ పార్లమెంట్‌వైపు దూసుకొచ్చారు. దీంతో పోలీసులు, భద్రతా దళాలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించాయి. వారిని అదుపుచేసే క్రమంలో భద్రతా బలగాలు జల ఫిరంగులు, టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించారు. ఈ కాల్పుల్లో 19 మంది మృతి చెందగా, 300 మందికిపైగా గాయపడ్డారు.




మొదటి పేజి తరువాయి



## ఆ రెండు శాఖల్లోనే ఆదాయం పెరిగిందా!

పైలట్ ప్రాజెక్టు కింద ఓ ప్రాజెక్టులో పూడికతీతను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం పనులను గిరిజన ఏజెన్సీల ద్వారానే నిర్వహించాలని, వారికి యంత్ర సామగ్రి అందుబాటులో ఉండదు కనుక, ఐటీడీఏల్లోని ఇంజనీరింగ్ విభాగం ద్వారా సమకూర్చాలని సూచించారు. ఔటర్ రింగురోడ్డు లోపలి భాగంలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధి విధానాలు రూపొందించాలని ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, వికాస్‌రాజ్, లోకేశ్ కుమార్, శ్రీధర్, శశాంక, రాజీవ్‌గాంధీ హనుమంతు, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజి తరువాయి

## గండిపేటకు తీసుకొస్తున్నవి కాళేశ్వరం నీళ్లా..? కాదా..?




ఈకబురు, హైదరాబాద్: "ఇటీవలే కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరిన ముఖ్యమంత్రి.. అదే కాళేశ్వరం ఆధారంగా నిర్మించిన మల్లన్నసాగర్‌తో.. మూసీ అనుసంధాన ప్రాజెక్టుకు ఈరోజు శంకుస్థాపన చేశారు. కూలేశ్వరం అని విమర్శించిన సీఎం.. ఇప్పుడు అవే నీళ్లను హైదరాబాద్‌కు తీసుకొస్తానంటున్నారు. మొన్న కొండపోచమ్మ సాగర్ నుంచి గంధమల్లకు నీళ్లు తీసుకొచ్చే పనులకు శంకుస్థాపన చేశారు. గండిపేటకు తెస్తున్నవి కాళేశ్వరం నీళ్లా? కాదా? సీఎం స్పష్టం చేయాలి" అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, సుధీర్‌రెడ్డి, వివేకానంద, ముఠా గోపాల్ తదితరులతో కలిసి కేటీఆర్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రైతుల యూరియా కష్టాలు తీర్చడంలో కాంగ్రెస్, భాజపాలు విఫలమయ్యాయి కాబట్టే.. ఆయా కూటముల అభ్యర్థులెవరికీ ఓటు వేయకూడదనే ఉద్దేశంతో ఉపరాష్ట్రపతి ఎన్నికలో పాల్గొనడం లేదని కేటీఆర్ వెల్లడించారు. మూసీ పునరుజ్జీవం పేరిట రూ.1.50 లక్షల కోట్ల దోపిడీకి ప్రభుత్వం కుట్రపన్నితే.. తమ పార్టీ, ప్రజలు అడ్డుకున్నారని, అందుకే ఒకేసారి కాకుండా.. విడతల వారీగా ప్రజాధనాన్ని లూటీ చేయడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ఆరోపించారు.] ఇందులో భాగంగానే తొలివిడతగా..గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రూ.1,100 కోట్లతో రూపొందించిన అంచనాలను ఏకంగా రూ.7,390 కోట్లకు పెంచారని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారానే తేవచ్చని, మరి ఎవరి లబ్ధి కోసం ఈ ప్రాజెక్టును మార్చారని ఆయన ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌మూసీ అనుసంధాన ప్రాజెక్టు వెనుక నేరపూరిత కుట్ర దాగి ఉందని, కేంద్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన సంస్థకే కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలుకు పైసలు లేవని ప్రభుత్వం చెబుతోందని.. ఇన్ని రూ.కోట్ల ప్రాజెక్టుకు అత్యవసరంగా ఎందుకు శంకుస్థాపన చేసిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇన్ని స్కాములు చేస్తుంటే.. భాజపా మౌనం వహిస్తోందని విమర్శించారు. పార్టీలో అంతర్గతంగా చర్చించి కవిత సస్పెన్షన్‌పై నిర్ణయం తీసుకున్నామని.. ఇప్పుడు ఆ విషయంపై మాట్లాడేదేమీ లేదని స్పష్టంచేశారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుకుంటుంటే.. తెలంగాణ పోలీసు విభాగం, ఇంటెలిజెన్స్, ఈగల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు స్వయంగా పీసీసీ అధ్యక్షుడే ఓ టీవీ ఇంటర్వ్యూలో ఒప్పుకొన్నారని.. కడియం శ్రీహరి కూడా అంగీకరించారని, నేరాంగీకారం జరిగాక విచారణ ఎందుకని, వేటు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మొదటి పేజి తరువాయి

## స్వదేశీ మేళాకు పట్టం కట్టండి



ఈకబురు, న్యూఢిల్లీ:స్నేహితుడు, శత్రువు అనే బేధం లేకుండా అమెరికా ప్రభుత్వం అందరిపై సుంకాలతో బాదేస్తున్న వేళ ప్రధాని మోదీ స్వదేశీరాగం అందుకున్నారు. విదేశీ వస్తువులపై మోజు తగ్గించుకుని స్వదేశీ వస్తువులకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో సోమవారం ఎన్డీఏ కూటమి ఎంపీలతో సమావేశంలో పలు అంశాలపై ప్రధాని మాట్లాడారు. "దేశవాళీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగేలా చూడండి. స్వదేశీ మేళాను ఉద్యమస్థాయికి తీసుకెళ్లండి. విదేశాల అధిక టారిఫ్‌ల వంటి ప్రతికూలతలు, సవాళ్ల సమయంలో భారత్ స్వావలంబన ద్వారా తన శక్తిసామర్థ్యాలను మరింతగా సంతరించుకోవాల్సిన తరుణమిది.

మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించండి. జీఎస్టీ రేట్లు భారీగా తగ్గిన చక్కటి తరుణంలో స్వదేశీ వస్తువుల గొప్పతనాన్ని జనాన్ని తెలిసేలా చేయండి. ముఖ్యంగా నవరాత్రి, దీపావళి వంటి పండుగల సీజన్‌లో మీమీ నియోజకవర్గాల్లో ప్రజలతో, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటుచేసి తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనాలను వివరించండి"అని మోదీ అన్నారు. మోదీ ప్రసంగ వివరాలను తర్వాత కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు మీడియాకు వివరించారు. అమెరికా 50 శాతం టారిఫ్ భారం మోపిన వేళ మోదీ స్వదేశీ వస్తువుల ప్రాశస్త్యాన్ని ప్రస్తావించడం గమనార్హం.

శక్తివంతమయ్యేవేళ సవాళ్లు సాధారణం

"భారత్ శక్తివంతంగా ఎదిగే క్రమంలో సవాళ్లు ఎదురవడం సాధారణం. అయినాసరే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించే క్రమంలో ఇలాటి సవాళ్లను ఎదుర్కొంటూ ఆత్మనిర్భర్‌ను సాధించాలి. సొంత నియోజకవర్గాల్లో దేశీయ ఉత్పత్తుల ప్రచారాన్ని మీరే నాయకులుగా ముందుండి నడపాలి. గతంలో భారత్‌లో జపాన్ తయారీ వస్తువుల వినియోగం అధికంగా ఉండేది. అలాంటి భారత్‌లో ఇప్పుడు దేశీయోత్పత్తులను అధికంగా ఉపయోగించగల్గుతున్నామని గర్వపడేలా మనం చేయాలి. మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమంలో స్వదేశీ ఉత్పత్తులు కనిపించాలి. ఉపయోగించాలి"అని ఎంపీలకు మోదీ సూచించారు. "జీఎస్టీ శ్లాబుల తొలగింపు అనేది ప్రజల్లో పెను సంచలనంగా మారింది. ప్రజలతో 'స్వదేశీ మేళాలు', వ్యాపారులతో 'వ్యాపారీ సమ్మేళన్'లు నిర్వహించండి. గాల్లో తుపాను చెలరేగినాసరే మనం వాహన టైరులో మళ్లీ గాలి కొట్టాల్సిందే. అలాగే దేశీయంగా 'స్వదేశీ వాతావరణం'ఉన్నాసరే మన మళ్లీ విడిగా మన వంతు తోడ్పాటు అందించాల్సిందే"అని అన్నారు.


ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జాగ్రత్త

"ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసేటప్పుడు ఎంపీలు జాగ్రత్త వహించండి. తప్పులు దొర్లకుండా ఓటేయండి. పార్లమెంట్ సభ్యులే ఓటింగ్‌లో తప్పులు చేస్తే ప్రజలకు తప్పుడు సందేశం వెళ్తుంది. మన అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ దేశవ్యాప్తంగా అన్ని వర్గాల్లో ఉత్తమ అభ్యర్థిగా పేరుతెచ్చుకున్నారు. ఆయన ఉపరాష్ట్రపతిగా చక్కటి సేవలు అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. తన పాలనాదక్షతతో ఆయ ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తేగలరని నేనూ విశ్వసిస్తున్నా"అని అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ఆమోదం పొందం వెనుక అధికార కూటమి ఎంపీల కృషిదాగి ఉందని మోదీ ప్రశంసించారు.

హిమాచల్, పంజాబ్‌కు నేడు మోదీ

వరద విలయంలో చిక్కుకుని అల్లాడిపోతున్న హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో తాజా పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని మోదీ మంగళవారం పర్యటించనున్నారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకూ మోదీ వెళ్లి అక్కడి బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారు. హిమాచల్‌లోని కంగ్రాకు మోదీ వెళ్లనున్నారు. అక్కడే ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

## జీఎస్‌డీపీ రూ.14.56 లక్షల కోట్లు




ఈకబురు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఏటేటా గణనీయంగా పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. నాలుగేళ్ల క్రితం రూ.10 లక్షల కోట్లకు పైగా స్థూల ఉత్పత్తి నమోదు కాగా, తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.14.56 లక్షల కోట్లకు చేరింది. అంటే గత నాలుగేళ్లలోనే దాదాపు 50% పెరిగిందన్నమాట. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల వెలువరించిన హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్ ఆన్ ఇండియన్ ఎకానమీ లో ఈ గణాంకాలను పొందుపరిచింది. ఈ కరదీపిక ప్రకారం 2023-24లో తెలంగాణ స్థూల ఉత్పత్తి రూ.13,22, 808 కోట్లు కాగా, ఏడాది కాలంలో 1.3 లక్షల కోట్లు పెరిగి రూ.14,56,837 కోట్లుగా నమోదైంది.

తలసరి ఉత్పత్తి రూ.3 లక్షల పైమాటే: ఆర్‌బీఐ వెల్లడించిన గణాంకాల ప్రకారం తెలంగాణ తలసరి స్థూల ఉత్పత్తి రూ.3.79 లక్షలకు చేరింది. 2024-25లో రూ.3,79,751గా తలసరి స్థూల ఉత్పత్తి నమోదైందని, ఇది 2023-24తో పోలిస్తే రూ.33 వేలు పెరిగిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ ఏర్పాటైన ఏడాది 2014-15లో తలసరి స్థూల ఉత్పత్తి రూ.1,24,104 కాగా, ఇప్పుడు మూడు రెట్ల కంటే ఎక్కువ పెరిగింది. పదేళ్ల కాలంలో 2.55 లక్షలు పెరిగింది. ఇక, రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణాంకాలు కూడా ఇదే నిష్పత్తిలో పెరిగాయి. రాష్ట్రం ఏర్పాటైన ఏడాది తెలంగాణ స్థూల ఉత్పత్తి రూ.4,56,280 కోట్లు కాగా, పదేళ్ల తర్వాత ఏకంగా రూ.10 లక్షల కోట్లు పెరిగింది. ఆర్‌బీఐ వెల్లడించిన ఈ నివేదిక ప్రకారం దక్షిణాది రాష్ట్రాలు స్థూల ఉత్పత్తి నమోదులో పురోగతిని కనబరుస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ (రూ.14,22,998 కోట్లు), కర్ణాటక (రూ. 26,03,948 కోట్లు), తమిళనాడు (రూ. 27,64,755 కోట్లు)లు కూడా దేశంలో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల సరసన నిలిచాయి.

తెలంగాణ విషయానికి వస్తే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతోపాటు సేవల రంగం విస్తృతి కారణంగా భారీ స్థాయిలో జీఎస్‌డీపీ నమోదైందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

## మూసీ పునరుజ్జీవం.. చేసి చూపిస్తాం



కృష్ణా, గోదావరి జలాల తరలింపు ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. గతంలో సచివాలయం ముందు ఖాళీ బిందెలు, కుండల ప్రదర్శనలు జరిగేవని, అలాంటి ఇబ్బందులన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వమే పరిష్కారం చూపిందన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచే హైదరాబాద్‌కు నీటి సరఫరా జరుగుతోందని, అది కూడా కాంగ్రెస్ హయాంలో నిర్మించిందేనని పేర్కొన్నారు. సీఎంగా వైఎస్సార్, మంత్రిగా శ్రీధర్‌బాబు ఉన్నప్పుడు ప్రాజెక్టును ప్రారంభించగా... 2016లో హైదరాబాద్‌కు నీళ్లు వచ్చాయన్నారు. నాడు మునిసిపల్ మంత్రిగా ఉన్న ఒకాయన శామీర్‌పేట వద్ద నెత్తి మీద గోదావరి జలాలు చల్లుకున్నాడని, నీళ్లు చల్లుకున్నంత మాత్రాన చేసిన పాపాలు పోవని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. 'ఒకాయన తాటి చెట్టులా పెరిగాడే కానీ.. మోకాలులోనూ మెదడు లేదు. కాళేశ్వరం నీళ్లు మల్లన్నసాగర్ నుంచి తీసుకుంటున్నారంటూ అర్థరహితంగా మాట్లాడుతున్నడు' అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును మీ తాత లేదా ముత్తాత కట్టారా? ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టులో మల్లన్నసాగర్ (ప్రతిపాదిత ప్రణాళికలోని తడ్కపల్లి చెరువును ఉద్దేశిస్తూ) లేదా? అని నిలదీశారు. కాసుల కక్కుర్తితో తుమ్మిడిహెట్టి దగ్గర నిర్మించాల్సిన బ్యారేజీని మేడిగడ్డలో నిర్మించడం ద్వారా రంగారెడ్డి జిల్లాకు బీఆర్ఎస్ అన్యాయం చేసిందన్నారు. 'మహారాష్ట్ర సీఎంతో మాట్లాడుతున్నం.. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ కట్టేందుకు అనుమతి అడిగాం. త్వరలో అక్కడకు వెళ్తా. వాస్తవానికి 148మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టేందుకు గతంలోనే ఒప్పందం జరిగింది. మధ్యే మార్గంగా 149150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టును నిర్మించి రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తాం" అని పేర్కొన్నారు. గోదావరి జలాలు తరలించడం ద్వారా చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ ప్రజలను ఆదుకుంటామన్నారు.పదేళ్లలో బీఆర్‌ఎస్‌కు ఆ ఆలోచనే రాలేదు

పదేళ్ల పాలనలో గోదావరి, కృష్ణా జలాలను హైదరాబాద్‌కు తరలించాలన్న ఆలోచనే చేయని ఘనత బీఆర్‌ఎస్‌ది అని ధ్వజమెత్తారు. "ఎన్నికలకు ముందు నల్లగొండలో ప్రచారానికి వెళ్లినప్పుడు.. అన్నా మూసీ నది మాకు విషం ఇస్తోందని అక్కడి ప్రజలు చెప్పారు. ఆనాడే వారికి మాట ఇచ్చా. అందుకే పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాం. తద్వారా హైదరాబాద్‌నూ సుందర నగరంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ఎవరు అడ్డం పడినా, ఒక్కొక్క అవాంతరాన్ని అధిగమించుకుంటూ వెళ్తామని స్పష్టం చేశారు. రూ.7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలను జంట జలాశయాలకు తీసుకువస్తున్నామని, ఇందులో 15, 16 టీఎంసీలు హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు, పరిసర ప్రాంతాల్లోని చెరువులు నింపేందుకు వినియోగిస్తామన్నారు. 4, 5 టీఎంసీలు మూసీ ప్రక్షాళనకు వాడనున్నట్టు తెలిపారు. మురికి కూపంగా మారిన మూసీ నదిని అద్భుతంగా మార్చుకుందామా? వద్దా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తుందనే కొందరు దుర్మార్గులు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 'రాజకీయంగా కోపం ఉంటే మాతో కొట్లాడండి. కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులను ఆపొద్దు. కలిసి రండి.. అభివృద్ధిలో భాగస్వాములు కండి' అని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. గేట్ వే ఆఫ్ హైదరాబాద్ కింద బుద్వేల్‌ను అద్భుతంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామని, మూడేళ్లలో ప్రపంచంతో పోటీ పడేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. వచ్చే వందేళ్లు రాష్ట్రం, హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేయాలన్న స్పష్టమైన ప్రణాళికతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకొస్తున్నామని, డిసెంబరు 9న జాతికి అంకితం చేస్తామన్నారు. విపక్ష నేతలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలుగా అడ్డం పడినా ప్రభుత్వం తిప్పికొడుతుందని, ఒక్కొక్కరి సంగతి తేలుస్తుందని అన్నారు. 'ఇది ఇందిరమ్మ రాజ్యం.. పేదల రాజ్యం.. పేదలకు న్యాయం జరుగుతుంది' అని ఉద్ఘాటించారు.కోకాపేట వద్ద హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రంపెట్ ఇంటర్‌చేంజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌కు, ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ (ఎగ్జిట్ 1ఏ) వల్ల ఇటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అటు పటాన్‌చెరు వైపు చేరుకోవడం మరింత సులభతరం కానుంది.ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఇండియా కూటమి తరఫున జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నిక అనంతరం సీఎం రేవంత్ పలువురు కేంద్రమంత్రులను కలిసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని, రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరనున్నారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తరభాగానికి టెండర్లను ఆహ్వానించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేయనున్నారు. హైదరాబాద్ కరీంనగర్ రామగుండం మార్గంలో కొత్త అలైన్‌మెంట్‌ను ఆమోదించాలని, మెట్రో రెండో దశకు నిధులివ్వాలని కేంద్ర మంత్రులను కోరుకున్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

ఉదయం 11 గంటలు దాటినా సంఘం ఇన్‌ఛార్జి సీఈవో శేషారావు రాకపోవడంతో లోడ్ దింపలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు.. జాతీయ రహదారితోపాటు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లనూ దిగ్బంధం చేశారు. కొందరు రైతులు బస్సు కింద పడుకొని నిరసన తెలిపారు. రెబ్బెన సీఐ ఎం.సంజయ్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పే క్రమంలో యూరియా ఇప్పించాలని ఓ రైతు ఆయన కాళ్లు పట్టుకొని వేడుకున్నారు. అధికారులతో మాట్లాడి పంపిణీ చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఒక్క బస్తా ఇస్తే పంటలను ఎలా కాపాడుకోవాలి..

మంచిర్యాల జిల్లా కోటపల్లి, చెన్నూరులో సోమవారం యూరియా కోసం అన్నదాతలు ఆందోళనకు దిగారు. వేకువజామున 3 గంటలకే వచ్చి వరుసలో నిల్చుంటే తలా ఒక్క బస్తా ఇస్తే పంటలను ఎలా కాపాడుకునేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటపల్లి రైతు వేదిక వద్ద టోకెన్ల పంపిణీ చేపట్టగా.. వరుసలో నిల్చున్న మహిళల మధ్య తోపులాట జరిగింది. యూరియా కోసం వివిధ గ్రామాల నుంచి సుమారు 1,500 మంది రైతులు రాగా.. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున అధికారులు పంపిణీ చేశారు. చెన్నూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందున్న ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రైవేటు ఎరువుల దుకాణానికి యూరియా బస్తాలతో వెళ్తున్న ఓ లారీని అడ్డుకున్నారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

యూరియా కోసం బారులు..

మహబూబాబాద్ జిల్లాలోని నర్సింహులపేట పీఏసీఎస్ కార్యాలయానికి 555 బస్తాల యూరియా రాగా.. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. కురవి పీఏసీఎస్‌కు 660 బస్తాలు రాగా సుమారు మూడు వేల మందికి పైగా రైతులు సోమవారం ఆరు గంటలకే కార్యాలయం వద్దకు చేరుకున్నారు. మహిళలు, దివ్యాంగులు సైతం వరుసలో నిలుచున్నారు. 500 మందికి పైగా కూపన్లు అందించగా మిగతావారు నిరాశతో వెనుదిరిగారు.



# వివాదాస్పద భూమిలో రక్షణ చర్యలు లేకుండా ఆగమేఘాల మీద పనులు



మృతి చెందిన శ్రీను(ఫైల్)

**విద్యుత్‌షాక్‌తో కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్ మృతి.**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : వివాదాస్పద భూమిలో ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా చేపట్టిన పనుల కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. ఆగమేఘాల మీద పనులు చేపట్టేందుకు ప్రయత్నించి విద్యుత్ చూసుకోకపోవడంతో విద్యుత్ షాక్ తగిలి కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన కు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం.. సూర్యపేట జిల్లా నాగారం మండల కేంద్రానికి చెందిన ఓర్సు శ్రీను(39) భార్య జయలక్ష్మి, కుమారుడు సందీప్‌తో కలిసి బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి శివారులోని పాశ మైలారంలో నివాసం ఉంటున్నారు. శ్రీను బండరాళ్లను తొలగించే కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మియాపూర్‌లోని వివాదాస్పద సర్వే నెంబర్ 100లో బిల్డింగ్ నిర్మాణ పనుల్లో వచ్చిన బండ రాళ్లను తొలగించేందుకు యజమాని పనులు చేపట్టాడు. దీంతో శ్రీను కంప్రెషర్ ట్రాక్టర్‌తో అక్కడికి వచ్చాడు. పనులు చేస్తుండగా అక్కడే ఉన్న బోరు మోటార్ కు విద్యుత్ సరఫరా చేసే వైరు కారణంగా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే తోటి కార్మికులు మదీనగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీను మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున హాస్పిటల్ వద్దకు చేరుకొని న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

# గ్యాస్ సిలిండర్‌కూ గడువుంటుంది.. ఇలా తెలుసుకోవచ్చు




ఈ-కబురు, : దాదాపు ప్రతిఒక్కరి ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్లు ఉంటాయి. మనం కొనే వస్తువులకు ఉన్నట్లు సిలిండర్లకు కూడా గడువు తేదీ ఉంటుందని చాలామందికి తెలియదు. దీంతో పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

కోడ్ ఇలా..

సిలిండర్ పై భాగంలో గుండ్రటి హ్యాండిల్‌కు అనుబంధంగా ఉన్న ప్లేట్ లోపలి వైపున ప్రత్యేక కోడ్ రాసి ఉంటుంది. ఇక్కడున్న ఒక్కో ఆంగ్ల అక్షరాన్ని మూడు నెలలుగా విభజించారు. దాని పక్కనున్న సంఖ్య సంవత్సరాన్ని సూచిస్తుంది. ఎ అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి, బి అంటే ఏప్రిల్, మే, జూన్, సి అంటే జులై, ఆగస్టు, సెప్టెంబర్, డి అంటే అక్టోబర్, నవంబర్, డిసెంబర్.

ఇలా ఎ-26 అని రాసి ఉంటే ఆ సిలిండరు గడువు తేదీ 2026వ సంవత్సరం జనవరి నుంచి మార్చి మధ్యలో ముగుస్తుందని అర్థం. సిలిండర్ తీసుకునే ముందు తప్పనిసరిగా దాని మీద గడువు తేదీని సూచించే కోడ్‌ను చూడాలి. ఒక వేళ గడువు అయిపోయినట్లు ఉంటే వెంటనే సిలిండర్ ఇచ్చేసి మరొకటి తీసుకోవాలి.

మొదటి పేజీ తరువాయి

# వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ భారత పర్యావరణానికి పెద్ద సవాలు : టిజి రెరా చైర్మన్ సత్యనారాయణ



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న సత్యనారాయణ తదితరులు



సదస్సు సావనీర్ ను విడుదల చేస్తున్న దృశ్యం

ఈకబురు, శేరిలింగంపల్లి : పర్యావరణాన్ని ధ్వంసం చేసిన ఏ నాగరికత మనుగడ సాగించలేదని చరిత్రను చూస్తే అర్థం అవుతుందని, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ భారతదేశ పర్యావరణానికి పెను సవాళుగా మారుతుందని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యూలేటరీ అథారిటీ(రెరా) చైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నిర్వహిస్తున్న 'సస్టెనబుల్ వేస్ట్ మేనేజిమెంట్ త్రూ సర్క్యూలర్ ఎకానమీ అండ్ టెక్నాలజీకల్ ఎన్నోవేషన్' అనే రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును సోమవారం సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వేల సంవత్సరాల క్రితం ఎంతో గొప్పగా జీవించిన సింధూ నగరికత ఓ గొప్ప ఉదహారణ అని అన్నారు. ప్రస్తుతం భూగ్రహం తన శక్తిని మించి మోస్తుందని, పర్యావరణ కాలుష్యం, సమతూల్యత దెబ్బతినదం కారణంగా చోటుచేసుకుంటున్న ఉపద్రవాలను చూస్తున్నామన్నారు. భారత్ లో పట్టణీకరణ వేగంగా పెరుగుతుందని, రాబోయే రోజుల్లో ఇది పర్యావరణానికి పెను సవాళుగా మారుతుందన్నారు. ప్రస్తుతం ఒక్కరోజుకు 1.60మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి జరుగుతుందని, పట్టణీకరణ పెరిగితే ఇది మరింత పెరుగుతుందన్నారు. పాత కాలంలో గ్రామాల్లోని ప్రతిఇంట్లో కంపోస్టు గుంత ఉండేదని, చెత్త బయటకు రాకపోగా, ఇంట్లో చెత్త ఎరువుగా మారేదన్నారు. కానీ పట్టణాల్లో చెత్త నేరుగా డంపింగ్ యార్డుకు చేరుతుందన్నారు. 2050 నాటికి వికసిత్ భారత్ లో భాగంగా జీరో వేస్ట్ లక్ష్యంగా ముందుకు సాగాలని భారత ప్రధాని పిలుపునిచ్చారని, ప్రతి పౌరుడు అందుకు అనుగుణంగా వేస్ట్ తో పునరుత్పత్తి, రీసైక్లింగ్ మీద దృష్టి పెట్టాలన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మాజీ చైర్మన్ సి.అచలేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఇండస్ట్రీయల్ రెవల్యూషన్ తరువాత పర్యావరణం వేగంగా కలుషితం అవుతుందన్నారు. ప్రస్తుతం ఎన్నో మల్టీనేషనల్ కంపెనీలు పర్యావరణ సమతూల్యత, రీసైక్లింగ్ మీద దృష్టి సారించాయని, కొత్తగా సస్టైనబుల్ ఆఫీసర్లను భర్తీ చేసుకుంటున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిఐఐ వైస్ చైర్మన్ ఎం. గౌతంరెడ్డి, వరల్డ్ బ్యాంకు కన్సల్టెంట్ డిఎ. మోహన్, ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ పిజీ. శాస్త్రీ, ఎస్కీ డైరెక్టర్ జి. రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రేగులకుంట ఆక్రమణపై బోనల్ కమీషనర్ కు 'జనంకోసం' పిర్యాదు




జోనల్ కమీషనర్ కు వినతిపత్రం సమర్పిస్తున్న జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి



రేగుల కుంటను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణ పనులు

**అనుమతులు మంజూరు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: కసిరెడ్డి భాస్కర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : హఫీజ్ పేట్ రేగుల కుంటను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాల పై జనంకోసం స్వచ్ఛంద సంస్థ సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ కు పిర్యాదు చేసింది. ఈమేరకు ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమీషనర్ హేమంత్ బోర్కడేను, చందానగర్ డిప్యూటీ కమీషనర్ ను కలిసిన జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్రెడ్డి రేగులకుంట కబ్జాపై ఆధారాలను సమర్పించడంతో పాటు గతంలో ఆర్డిఓ కార్యాలయం చేసిన సర్వే రిపోర్టును అందజేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కర రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలోని హఫీజ్ పేట్ గ్రామం సర్వే నెంబరు 151లో రేగుల కుంట చెరువు విస్తరించి ఉందన్నారు. కాగా కొంతకాలం క్రితం చెరువు అభివృద్ధి పేరుతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన అధికారులు రేగుల కుంట కబ్జాలను సక్రమం చేసే చర్యలకు దిగారని వాపోయారు. గతంలో రేగుల కుంట ఆక్రమణలపై జనంకోసం చేసిన పిర్యాదుకు స్పందనగా రంగారెడ్డి జిల్లా ఆర్డిఓ కార్యాలయం పూర్తి సర్వే చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. సదరు సర్వేలో రేగుల కుంట చెరువు స్థలాన్ని ఆక్రమించి సర్వే నెంబరు 150,151లలో పలు నిర్మాణాలు, ప్లాట్లు చేసిన విషయం వెలుగు చూసిందన్నారు. కాగా వాకింగ్ ట్రాక్ పేరుతో చెరువు స్థలాన్ని వదిలిపెట్టి కట్ట నిర్మాణం చేపట్టడం కబ్జాదారులకు ఆయాచితవరంగా మారిందని వాపోయారు. ఖాళీ స్థలానికి డాక్యుమెంట్లను తయారు చేసిన కబ్జాదారులు నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ అనుమతి తీసుకొని పనులు చేపడుతున్నారని తెలిపారు. చెరువు స్థలం అని గత సర్వే తేల్చి చెప్పినా, జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణ అనుమతులు మంజూరు చేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో చెరువు విస్తీర్ణాన్ని కుదించడంతో పాటు చెరువు స్థలంలో నిర్మాణ అనుమతులు మంజూరు చేసిన అధికారులపై, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే నిర్మాణ పనులను అడ్డుకొని, రేగుల కుంటను పునరుద్ధరించాలని కోరారు.

# అయ్యప్ప సొసైటీ అక్రమ నిర్మాణాలకు అక్రమ విద్యుత్ కనెక్షన్లు



**అక్రమ కనెక్షన్లపై విజిలెన్స్ విచారణ**

ఈకబురు, శేరిలింగంపల్లి : మాదాపూర్ అయ్యప్ప సొసైటీ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. అయ్యప్ప సొసైటీ కేంద్రంగా అధికారులు అక్రమాల పంట పండిస్తున్నారు. ఇక్కడి అక్రమ నిర్మాణాలు అధికారుల జేబులను నింపుతున్నాయి. అక్రమ సంపాదన కోసం ఓవైపు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తుండగా... నిర్మాణదారులు ఇచ్చే లంచాలకు కక్కుర్తి పడి విద్యుత్ శాఖ, జలమండలి అధికారులు సైతం గుడ్డిగా అక్రమ కనెక్షన్లను మంజూరు చేస్తున్నారు. జిహెచ్ఎంసి ఎన్ఓసి లేకపోయినా అక్రమ నిర్మాణదారులు ఇచ్చే లంచాలకు మరిగి విద్యుత్ శాఖ అధికారులు అక్రమ కనెక్షన్లతో పాటు ఏకంగా ట్రాన్స్ఫార్మర్లను సైతం మంజూరు చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల అవినీతిపై భారీ ఎత్తున ఫిర్యాదులు రావడంతో విద్యుత్ శాఖలోని విజిలెన్స్ విభాగం అయ్యప్ప సొసైటీ గోల్ మాల్ వ్యవహారంపై దృష్టి సారించింది. ఈ మేరకు తాజాగా మాదాపూర్ అయ్యప్ప సొసైటీ లో అనుమతులు లేని నిర్మాణాలకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, చంద్రనాయక్ తండా ఏరియాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలకు ఏ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు ఇచ్చారు అనే విషయాలపై ఆరా తీశారు. జిహెచ్ఎంసి చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్ అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, చంద్రనాయక్‌తండా, అగర్వాల్ లేఅవుట్ లపై సుప్రీం కోర్టుల్లో కేసులు ఉన్నాయి. ఈ భూముల్లో జీహెచ్ఎంసీ ఎటువంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. కానీ అధికారుల జేబులు నింపుతున్న అక్రమ నిర్మాణదారులు ఈ ప్రాంతాల్లో భారీ ఎత్తున అనుమతి లేని అక్రమ భవనాలు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాల అవినీతి సొమ్ముకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ రెవెన్యూ అధికారులు అనుమతి లేని నిర్మాణాలను అడ్డుకోకుండా తోడ్పాటును అందిస్తున్నారు. తామేం తక్కువ అంటూ విద్యుత్ శాఖ జలమండలి అధికారులు సైతం వీరి బాటలోనే పయనిస్తున్నారు. లంచాలు తీసుకుంటూ ఎటువంటి ఎన్ఓసీలు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలకు విద్యుత్, మంచినీటి కనెక్షన్లను మంజూరు చేస్తున్నారు. విద్యుత్ శాఖలో కిందిస్థాయి లైన్ మెన్ నుంచి డిఈ స్థాయి అధికారి వరకు భారీగా ముడుపులు తీసుకుంటూ అనుమతి లేని నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు, ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేస్తున్నారు. ఈ బాగోతంపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. సోమవారం అయ్యప్ప సొసైటీలోని పలు ఏరియాల్లో తిరిగి అక్రమ నిర్మాణాలకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లపై ఆరా తీశారు. విజిలెన్స్ అధికారుల విచారణలో స్థానిక విద్యుత్ శాఖ అధికారుల బాగోతం బయటపడుతుంది. ఏలాంటి అనుమతులు లేని, ఎన్ఓసీ లేకుండానే నిర్మాణాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఇచ్చినట్లు విచారణలో తేలింది. త్వరలోనే పలువురు అధికారులపై చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు.

# సత్వరమే తుమ్మిడిహెట్టికి డీపీఆర్

ఈకబురు, హైదరాబాద్‌హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి సత్వరమే సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును గత ప్రభుత్వం రీఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం, వార్ధా ప్రాజెక్టులుగా విభజించగా, వార్ధా ప్రాజెక్టును పక్కనపెట్టి తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మించాలనే అంశంపై త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నీటిపారుదల శాఖపై సోమవారం ఆయన జలసౌధలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు.

డిసెంబర్‌లోగా ఫలితాలు కనిపించాలి

నిర్మాణంలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగిరం చేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. డిసెంబర్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకునే నాటికి గుర్తించదగని ఫలితాలను ప్రజలకు అందించాలని స్పష్టం చేశారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులతోపాటు టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) క్లియరెన్స్‌కు ఈ నెల 23న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) నిర్వహించను న్న సమావేశానికి సర్వం సిద్ధం కావాలని సూచించారు. సమ్మక్కసాగర్‌తో ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడనున్న ముంపుపై ఇ ప్పటికే అధ్యయన నివేదిక అందిన నేపథ్యంలో ఆ రాష్ట్రం నుంచి సత్వరమే ఎన్‌ఓసీ సాధించాలని సూచించారు. సీతమ్మసాగర్, మోడికుంటవాగు ప్రాజెక్టులతోపాటు చనాకా-కొరాటా, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల డిస్ట్రిబ్యూటరీ వ్య వస్థలకు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద కేంద్ర నిధులకు దరఖాస్తు చేసుకోవడానికి అవసరమైన ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌ల ను వారం రోజుల్లోగా సీడబ్ల్యూసీ నుంచి పొందాలని ఆదేశించారు. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పున:పంపిణీ అంశంపై కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట ఈ నెల 23-25 తేదీల్లో రాష్ట్రం తరపున వినిపించనున్న తుది వాదనలకు తాను స్వయంగా హాజరవుతానని, సమయం లభిస్తే సీఎం రేవంత్ సైతం హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్‌తో మరోసారి సమావేశమై చర్చిస్తామన్నారు.

డిజైన్ల తయారీ బాధ్యత సీడీఓదే...

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమి టీ సిఫారసులను కచ్చితంగా అనుసరిస్తూ మేడిగడ్డ, అ న్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు డిజైన్లను రూపొందించే బాధ్యత శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీ ఓ)దేనని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. విఫలమైన బరాజ్‌లలోని లోపాలను సరిదిద్ది పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లు రూపొందించే నైపుణ్యం తమకు లేదని సీడీఓ చీ ఫ్ ఇంజనీర్ నిస్సహాయత వ్యక్తం చేయడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ల తయారీకి ఐఐటీ రూర్కీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను నియమించుకోవాలని ఆదేశించారు.

కొడంగల్ తొలి ప్రాధాన్యం

కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలను తొలి ప్రాధాన్యంగా తీసుకొని భూసేకరణను పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి, జూరాల, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీ మా, కోయిల్‌సాగర్‌ను అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టులుగా పరిగణించి సత్వరం పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు డిండి, ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టుల మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలన్నారు. జూ రాల ప్రాజెక్టుపై ప్రత్యామ్నా య బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

10న ఛత్తీస్‌గఢ్‌కు మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 10న ఛత్తీస్‌గఢ్ రాజధాని న్యూ రాయ్‌పూర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం విష్ణుదేవ్ సాయితో సమావేశం అవుతారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకి అనుమతుల విషయంలో ఈ నెల 23న కేంద్ర జలసంఘం కీలక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆలోగా ప్రాజెక్టుకి ఎన్‌వోసీ జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎంకు ఉత్తమ్ విజ్ఞప్తి చేయనున్నారు.

పూడిక తొలగింపుతో ఏటా రూ.500 కోట్లు

మిడ్‌మానేరు, కడెం ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపునకు చర్యలు ప్రారంభించడం ద్వారా పూడిక తొలగింపుపై జాతీయ పాలసీని అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. జూరాల, సాగర్, శ్రీరాంసాగర్, హుస్సేన్‌సాగర్, ఇతర ప్రాజెక్టుల్లో సైతం పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పూడిక తొలగింపుతో ప్రభుత్వానికి ఏటా రూ.500 కోట్ల అదనపు ఆదాయం రానుందని, అన్ని జలాశయాల్లో చేపడితే రూ.3,000-4,000 కోట్లకు ఆదాయం పెరుగుతుందన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకాల పునరుద్ధరణలో భాగంగా హెలికాప్టర్లతో నిర్వహించతలపెట్టిన ఏరియల్ మా గ్నటిక్ సర్వేకు డీజీసీఏ నుంచి సత్వరంగా అనుమతులు తీసుకొని సర్వేను చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

మూడు దశాబ్దాల తర్వాత శాఖలోని ఇంజనీర్లకు ఇటీవల పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఈ నెల 14న సాయంత్రం 5 గంటలకు జలసౌధలో నిర్వహించనున్న కృతజ్ఞత సభకు ఏర్పాట్లు చేయాలన్నారు.



# ఆధార్‌ను 12వ నిర్ణీత పత్రంగా చేర్చండి



**మంగళవారానికల్లా దీనిని అమలు చేయండి**
**బిహార్ ఎస్ఐఆర్‌పై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం**

ఈకబురు దిల్లీ: బిహార్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)లో ఓటరు గుర్తింపును నిర్ధారించుకునే పత్రాల్లో ఆధార్‌నూ తప్పనిసరిగా చేర్చాలని ఎన్నికల సంఘాన్ని(ఈసీ) సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఓటరుగా నమోదు కోసం రాష్ట్ర ప్రజలకు 11 నిర్ణీత పత్రాలను ఈసీ నిర్దేశించింది. సుప్రీంకోర్టు ఆదేశంతో ఆ జాబితాలో 12వ పత్రంగా ఆధార్ చేరనుంది. మంగళవారాని (ఈ నెల 9వ తేదీ) కల్లా దీన్ని అమలు చేయాలని స్పష్టం చేసింది. పౌరసత్వానికి ఆధార్ సాక్ష్యం కాదని చెబుతూనే.. నిజమైన ఓటరు అవునో కాదో నిర్ధారించుకోవడానికి దరఖాస్తుదారు సమర్పించే ఆధార్ నంబరును కూడా పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం పేర్కొంది. అక్రమ వలసదారులను ఓటరు జాబితాలో చేర్చాలని ఎవరూ కోరడంలేదని.. నిజమైన, అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు ఉండాలని అభిలషిస్తున్నారని తెలిపింది. నకిలీ, ఫోర్జరీ పత్రాలు సమర్పించిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాల్సిందేనని ధర్మాసనం పేర్కొంది. ఇతర పత్రాల మాదిరిగానే ఆధార్‌ను కూడా అసలైనదో, నకిలీదో పరిశీలించి ఎన్నికల సంఘం నిర్ధారించుకోవాలని తెలిపింది. ఓటరు సమర్పించిన ఆధార్ పత్రాన్ని తీసుకోవడానికి అంగీకరించని ఎన్నికల అధికారులకు గతంలో తాము జారీ చేసిన షోకాజ్ నోటీసులకు ఈసీ వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. ఆధార్ చెల్లుబాటు గురించి ఆధార్ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలను ధర్మాసనం గుర్తుచేసింది. తదుపరి విచారణను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది. తమ ఆదేశాలను ఈసీ వెబ్‌సైట్‌లో ప్రచురించాలని స్పష్టం

# రాజస్థాన్‌లో కుండపోత.. ఇద్దరి మృతి



ఈకబురు జైపుర్: రాజస్థాన్ అంతటా కుండపోత కారణంగా సోమవారం ఇద్దరు మరణించారు. పలువురు గాయపడ్డారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. భరత్‌పుర్‌లోని డీగ్‌లో రెండతస్తుల భవనం కూలి ఒకే కుటుంబంలోని ఇద్దరు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. సవాయ్ మాధోపుర్ చౌత్‌లో ఓ ప్రభుత్వ పాఠశాల భవనం కూలింది. అయితే అప్పటికి విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలను మూసేశారు. హరిద్వార్‌లోని మాన్‌సా దేవి ఆలయ మార్గంలో కొండచరియలు విరిగి టన్నెల్‌పై పడ్డాయి. దీంతో హరిద్వార్‌దేహ్రాదూన్ రైలు మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు తెలిపారు.

# పాత స్టాక్ పైనా డిస్కౌంట్!




**కంపెనీలు, డీలర్లు, రిటైలర్ల వద్ద పెద్ద ఎత్తున నిల్వలు**

**రేట్లు తగ్గించి విక్రయించే యోచనలో ఎఫ్ఎంసీజీ సంస్థలు**

**కొత్త రేట్లతో ఉత్పత్తులు రాక వచ్చే నెలలోనే**

న్యూఢిల్లీ: తగ్గిన ధరలపై ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు మార్కెట్లోకి రావడానికి కొంత సమయం పట్టేట్టు ఉంది. వచ్చే నెల ఆరంభం లేదా మధ్య నాటికి ఈ ఉత్పత్తులు మార్కెట్‌కు చేరుకుంటాయని గోద్రేజ్ కన్స్యూమర్ సహా పలు ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. కానీ, ఇప్పటికే కంపెనీలు, డీలర్లు, రిటైల్ స్టోర్లలో పెద్ద ఎత్తున ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయి.

ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్న నేపథ్యంలో.. పాత స్టాక్‌ను ఎలా విక్రయించాలా? అన్న ఆలోచనలో పడ్డాయి. పాత ఎంఆర్‌పీ (గరిష్ట చిల్లర విక్రయ ధర)పై తగ్గింపు రేట్లతో ఈ నెల 22 తర్వాత కూడా వాటిని విక్రయించేందుకు ప్రభుత్వం అనుమతిస్తుందన్న ఆశతో ఉన్నాయి. పాత స్టాక్ ఖాళీ అయి, కొత్త స్టాక్ మార్కెట్లోకి వచ్చే వరకు కొన్ని అవాంతరాలు ఎదుర్కోక తప్పేట్టు లేదని భావిస్తున్నాయి.

ఏ విధంగా ముందుకు వెళ్లాలన్నది ప్రతి సంస్థ ఆలోచిస్తోందని ఇమామీ వైస్ చైర్మన్, ఎండీ హర్ష వర్ధన్ అగర్వాల్ తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత కోరుతున్నట్టు చెప్పారు. అయినప్పటికీ సాధ్యమైనంత త్వరగా ఎంఆర్‌పీలను మార్చడం దిశగా పనిచేస్తున్నట్టు తెలిపారు. దీన్ని ఎదుర్కోవడంపై ఒక ప్రణాళికతో ముందుకు వస్తామని ప్రకటించారు. జీఎస్‌టీలో 12, 28 శాతం రేట్లను ఎత్తివేసి, ఇందులోని వస్తువులను 5, 18% శ్లాబుల్లోకి మార్చడం తెలిసిందే. ఈ రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి.

**స్వల్పకాలంలో ఇబ్బందులు తప్పవు..**

అధిక టారిఫ్‌ల్లోని ఉత్పత్తులను 5 శాతం కిందకు తీసుకురాడం వల్ల స్వల్పకాలంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని గోద్రేజ్ కన్స్యూమర్ ఎండీ, సీఈవో సుదీర్ సీతాపతి చెప్పారు. డీలర్లు, కంపెనీల వద్ద అధిక ఎంఆర్‌పీలతో ఉత్పత్తుల నిల్వలు ఉన్నట్టు చెప్పారు. కనుక కొత్త ఎంఆర్‌పీలతో కూడిన ఉత్పత్తులు వినియోగదారులను చేరుకోవడానికి కొంత సమయం పడుతుందన్నారు. పాత స్టాక్‌పై తగ్గింపు ఇస్తే అది నేరుగా వినియోగదారులకు బదిలీ అవుతుందన్న గ్యారంటీ లేదన్నారు.

**స్పష్టత కోసం చూస్తున్నాం..**

కొత్త జీఎస్‌టీ రేట్ల అమలు మార్గదర్శకాల కోసం పరిశ్రమ వేచి చూస్తున్నట్టు పార్లే ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ షా తెలిపారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వాన్ని సంప్రదించామని, వెంటనే కొత్త రేట్లకు మారిపోవాలా లేక కొత సమయం ఇస్తారా? అన్నది తెలుసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే పాత ధరలతో ఉన్న నిల్వల విషయంలో ఒక్కో కంపెనీ భిన్నమైన సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులతో పోల్చినప్పుడు ఆహారోత్పత్తుల మన్నిక (షెల్ఫ్ లైఫ్/నిల్వ కాలం) తక్కువగా ఉంటుందన్నారు. ఏం చేయాలన్నది అంతా ప్రభుత్వ మార్గదర్శకాలపైనే ఆధారపడి ఉంటుందంటూ, ఇవి త్వరలో వస్తాయని ఆశిస్తున్నట్టు చెప్పారు.

**ముందే తగ్గిస్తాం..**

తమ స్టోర్లలో ఉన్న ఉత్పత్తుల ధరల లేబుళ్లను మార్చబోమని, దీనికి బదులు తుది బిల్లు మొత్తంపై తగ్గింపు ఇస్తామని వీ-మార్ట్ రిటైల్ చైర్మన్, ఎండీ లలిత్ అగర్వాల్ ప్రకటించారు. ప్రభుత్వం జీఎస్‌టీలో కల్పించిన ఉపశమనం మేర బిల్లులో తగ్గింపు ఉంటుందన్నారు. కంపెనీ స్టోర్లలో కస్టమర్లకు తెలిసేలా బోర్డులు పెట్టినట్టు చెప్పారు. ఏసీలు, ఇతర కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలోని బ్లూస్టార్ సైతం సెపెటెంబర్ 22 తర్వాత కస్టమర్లకు తగ్గింపులు ఇవ్వనున్నట్టు ప్రకటించింది.


# ఎగుమతిదార్లకు విస్తృత ప్యాకేజీ!



**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

దిల్లీ: అమెరికా విధించిన 50 శాతం టారిఫ్ వల్ల ఇబ్బంది పడుతున్న భారతీయ ఎగుమతిదార్లకు ఊతమిచ్చేందుకు ఒక విస్తృత ప్యాకేజీని తీసుకురావడంపై పనిచేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. భారత ఎగుమతులపై ప్రభావాన్ని మదింపు చేయడానికి అన్ని విభాగాలతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. 'ఆగస్టు 27 నుంచి 50% సుంకం అమల్లోకి వచ్చిన తర్వాత వేర్వేరు పరిశ్రామిక రంగాలు, వివిధ మంత్రిత్వ శాఖలతో టారిఫ్ ప్రభావాన్ని పంచుకున్నాయి. వీరికి మద్దతునిచ్చేందుకు మొత్తం సమాచారాన్ని సేకరిస్తున్నామ'ని మంత్రి అన్నారు. అమెరికా సుంకాల కారణంగా జౌళి/దుస్తులు, ఆభరణాలు, రొయ్యలు, తోలు, పాదరక్షలు, జంతు ఉత్పత్తులు, రసాయనాలు, ఎలక్ట్రికల్, మెకానికల్ మెషినరీ వంటి వాటిపై ప్రభావం పడుతోంది. ఫార్మా, ఇంధన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఇంకా ఈ సుంకాల పరిధిలోకి

# సంఘటిత రంగం వైపు ఉద్యోగుల అడుగులు



**ఈపీఎఫ్‌వోలో పెరుగుతున్న సభ్యులు**

**2024–25లో రికార్డు స్థాయి నమోదు**

ముంబై: దేశంలో ఉద్యోగ మార్కెట్‌లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అసంఘటిత రంగం నుంచి క్రమంగా సంఘటిత రంగంలో ఉపాధి వైపు కార్మికులు అడుగులు వేస్తున్నారు. దీంతో ఉద్యోగుల భవిష్యనిధి సంస్థలో సభ్యుల చేరిక ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను తాకుతోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయి సభ్యుల చేరిక దీన్నే సూచిస్తున్నట్టు క్వెస్ కార్ప్ నివేదిక తెలిపింది. సుమారు 1.4 కోట్ల మంది గత ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌లో నికరంగా చేరారు.

2018–19 సంవత్సరంలో నికర సభ్యుల నమోదు 61 లక్షలతో పోల్చి చూస్తే రెట్టింపునకు పైగా పెరిగింది. క్వెస్ కార్ప్ విడుదల చేసిన 'ఇండియా వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్' నివేదిక ప్రకారం.. దేశంలో 57 కోట్ల మంది కార్మికుల్లో ఇప్పటికీ 80 శాతం మంది అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. 2024–25లో కొత్తగా చేరిన ఈపీఎఫ్‌వో సభ్యుల్లో 61 శాతం మంది వయసు 29 ఏళ్లలోపే ఉంది. ఇందులోనూ సగం మంది వయసు 18–25 ఏళ్ల మధ్య ఉండడాన్ని గమనించొచ్చు. యువ భారతీయుల మొదటి ఎంపిక సంఘటిత రంగంలోని ఉద్యోగమేనని క్వెస్‌కార్ప్ నివేదిక తెలిపింది.

**పెరిగిన మహిళా భాగస్వామ్యం..**

2025 మార్చి నాటికి సంఘటిత రంగంలోని మహిళా కార్మికుల భాగస్వామ్యం 41.7 శాతానికి చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త సభ్యులు ప్రతి ముగ్గురిలో ఒకరు మహిళ కావడం గమనార్హం. ఉపాధి కల్పన పరంగా రిటైల్, బీఎఫ్ఎస్ఐ, తయారీ, టెలికం అగ్రగామి రంగాలుగా ఉన్నాయి. మానవ వనరుల సేవలు అందించే క్వెస్ కార్ప్.. 2024–25లో అత్యధికంగా 1.03 లక్షల మందికి టెలికంలో ఉపాధి చూపించింది. ఇందులో 43,000 మంది కొత్త సభ్యులు ఉన్నారు. తయారీ రంగంలో ఉద్యోగాలు గత నాలుగేళ్లలో ఏటా 32 శాతం చొప్పున పెరుగుతూ వచ్చాయి. నియామకాల పరంగా అధిక వృద్ధి ఈ రంగంలో నమోదైంది. ఇక సగటున రూ.28,500 వేతనంతో బీఎఫ్ఎస్ఐ టాప్‌లో నిలిచింది. ఆ తర్వాత రిటైల్‌లో రూ.23,000 వేతనం ఉంది. "ఉద్యోగుల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు వీలుగా సామాజిక వసతుల ఏర్పాటుపై ఎక్కువగా దృష్టి సారించాలి. సురక్షితమైన వసతి, రవాణా సదుపాయాలను కల్పించడం ద్వారా ఇందుకు సంబంధించి ఆందోళనలను పరిష్కరించొచ్చు"అని క్వెస్ కార్ప్ ప్రెసిడెంట్ లోహిత్ భాటియా తెలిపారు.

# వచ్చే నెల్లోనే రూ.15,000 కోట్ల ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓ




కొరియా సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, తన భారతీయ యూనిట్‌ను వచ్చే నెల తొలి పబ్లిక్ ఇష్యూ(ఐపీఓ)కు తీసుకురానుంది. రూ.15,000 కోట్ల విలువైన 10.2 కోట్ల షేర్ల (కంపెనీలో 15% వాటా)ను ఈ ఐపీఓ ద్వారా విక్రయించనుంది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా వచ్చిన ఐపీఓల్లో ఇదే అతిపెద్దది కానుంది. మార్కెట్ పరిస్థితులు మెరుగుపడేంత వరకు వేచిచూద్దామన్న భావనతో, ఇప్పటిదాకా ఆలస్యం చేసిన ఎల్‌జీ, వచ్చే నెలను ఐపీఓకు సరైన సమయంగా భావిస్తోంది. ఐపీఓకు అనుమతి కోరుతూ 2024 డిసెంబరులోనే సెబీ వద్ద ముసాయిదా పత్రాలను ఎల్‌జీ దాఖలు చేయగా.. ఈ ఏడాది మార్చిలో అనుమతులు లభించాయి. ఏప్రిల్-మేలోనే ఇష్యూకు రావాలని సంస్థ భావించినా.. అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయ రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల వల్ల మార్కెట్ ఊగిసలాటలో ఉండడంతో వాయిదా వేసుకుంటూ వచ్చింది. 2025లో ఇప్పటిదాకా దాదాపు 30 ఐపీఓలు వచ్చాయి. ఇవి రూ.60,000 కోట్లకు పైగా సమీకరించాయి.

# ఆగస్టులో 3% పెరిగిన వాహన విక్రయాలు



**ఆటో డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడి**

న్యూఢిల్లీ: దేశీయ వాహన రిటైల్ విక్రయాలు ఆగస్టులో స్వల్పంగా 3% పెరిగాయని వాహన డీలర్ల సమాఖ్య (ఫాడా) గణాంకాలు వెల్లడించింది. మొత్తం ఆగస్టులో 19,64,547 వాహన రిజిస్ట్రేషన్లు కాగా, 2024 ఆగస్టులో ఇవి 19,10,312గా ఉన్నాయని ఫాడా తెలిపింది.

జీఎస్‌టీ అమల్లోకి వస్తే ధరలు దిగి వస్తాయని కస్టమర్లు కొనుగోళ్లను వాయిదా వేసుకోవడంతో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని పేర్కొంది. "వేచి చూసే ధోరణి కారణంగా సెప్టెంబర్ ప్రథమార్ధమంతా అమ్మకాలు అంతంత మాత్రమే ఉండొచ్చు. జీఎస్‌టీ విధానంపై స్పష్టత, పండుగ సెంటిమెంట్‌తో ఈ నెల అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి ఉండొచ్చు" అని ఫాడా అంచనా వేసింది.

ప్యాసింజర్ విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 3,20,291 యూనిట్ల నుంచి స్వల్పంగా 0.93% పెరిగి 3,23,256 కు చేరాయి. మెరుగైన ఎంక్వైరీలు, పండుగ బుకింగ్స్‌తో ఆగస్టు ప్రథమార్ధమంతా సానుకూల ధోరణి కనిపించింది. అయితే ఆగస్టు 15న ప్రధాని జీఎస్‌టీ సంస్కరణ ప్రకటనతో కస్టమర్లు కొనుగోళ్లు వాయిదా వేసుకున్నారని ఫాడా తెలిపింది.

ద్వి చక్ర వాహనాల రిజిస్ట్రేషన్లు 2.17% పెరిగాయి. ఈ ఆగస్టులో మొత్తం 13,73,675 అమ్మకాలు జరిగాయి. గతడాది ఇదే నెలలో విక్రయాలు 13,44,380 యూనిట్లుగా ఉన్నాయి. ఈ విభాగపు ఎంక్వైరీలు ఇప్పటికీ బలంగా ఉన్నాయి. ఓనమ్, గణేశ్ చతుర్థి పండుగ ప్రారంభంతో చాలా మంది కస్టమర్లు డెలివరీల కోసం ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఉత్తర భారతదేశంలో అధిక వర్షా లు, వరదలు గ్రామీణ రాకపోకలకు అంతరాయంతో అమ్మకాలపై ప్రభావాన్ని చూపాయి.

వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు ఆగస్టులో 69,635 యూనిట్ల నుంచి 8.55% పెరిగి 75,592 యూనిట్లకు చేరుకున్నాయి. త్రీవీలర్ రిటైల్ అమ్మకాలు 1,05,493 యూనిట్ల నుంచి 2% తగ్గి 1,03,105కు దిగివచ్చాయి.

# ఏఆర్ రెహమాన్ కోసం రూ.70 లక్షలు వదులుకొన్న శ్రీదేవి




దివంగత నటి శ్రీదేవి చివరి రోజుల్లో నటించిన చిత్రం 'మామ్' . రవి ఉద్యవర్ దర్శకత్వంలో బోనీ కపూర్ నిర్మాతగా చేసిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. ఈ చిత్రం షూటింగ్ రోజులను తాజాగా బోనీ కపూర్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. 'మామ్' కోసం శ్రీదేవి ఎంతో కష్టపడినట్లు చెప్పారు. "శ్రీదేవి బాలీవుడ్‌కు వచ్చినప్పుడు ఆమెకు హిందీ మాట్లాడడం తెలియదు. మొదటి ఆరు సినిమాలకు వేరే వాళ్లు డబ్బింగ్ చెప్పారు. ఆ తర్వాత ఆమె స్వయంగా డబ్బింగ్ థియేటర్‌లో హిందీ పాఠాలు నేర్చుకొని తన సినిమాలకు సొంతంగా డబ్బింగ్ చెప్పడం ప్రారంభించింది. తన చివరి చిత్రం 'మామ్'లో ఎంతో అంకితభావంతో నటించింది. ఈ సినిమాకు తెలుగు, తమిళ, హిందీ వెర్షన్‌లకు స్వయంగా ఆమె డబ్బింగ్ చెప్పింది. మలయాళం పనులను దగ్గరుండి చూసుకుంది. అలాంటి నిబద్ధత చాలా తక్కువమంది ఆర్టిస్టులకు ఉంటుంది" అని బోనీకపూర్ ప్రశంసించారు.

అఫీషియల్.. 46 ఏళ్ల తర్వాత కమల్, రజనీ మల్టీస్టారర్

మామ్ కోసం శ్రీదేవి రెమ్యునరేషన్‌లో కొంతభాగం వదులుకున్నట్లు ఆయన వెల్లడించారు. "ఈ సినిమా కోసం ఏఆర్ రెహమాన్‌ను తీసుకోవాలని అనుకున్నాం. అయితే, ఇండస్ట్రీలో ఉన్న ఖరీదైన సంగీత దర్శకుల్లో ఆయన ఒకరు కావడంతో మేం ఆలోచనలో పడ్డాం. అప్పుడు శ్రీదేవి తన రెమ్యునరేషన్‌లో రూ.70 లక్షలు ఆయనకు ఇవ్వాలని చెప్పింది. దీంతో మా పని సులువైంది" అని చెప్పారు. ఇక 'మామ్' సినిమా షూటింగ్ సమయంలో శ్రీదేవి తనతో రూమ్ పంచుకోవడానికి కూడా నిరాకరించిందని బోనీ కపూర్ తెలిపారు. "పాత్రపై పూర్తిగా దృష్టిపెట్టాలని, మైండ్ డైవర్ట్ కాకుండా ఉండాలని ఒంటరిగానే రూమ్‌లో ఉండేది. నోయిడా, జార్జియాలో షూటింగ్ జరిగే సమయంలోనూ రూమ్‌లో తాను ఒంటరిగా ఉండేది. ఎప్పుడూ స్క్రిప్ట్ ప్రాక్టీస్ చేసుకునేది" అని తెలిపారు.

2018లో శ్రీదేవి మరణించిన విషయం తెలిసిందే. 'మామ్' చిత్రం 2017లో విడుదలైంది. నాలుగు భాషల్లో ప్రేక్షకుల ముందుకువచ్చి బ్లాక్‌బస్టర్‌ను సొంతం చేసుకుంది. రూ.30 కోట్లతో రూపొందించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.175 కోట్లు వసూలుచేసింది.

# డీమన్ స్లేయర్ స్క్రీనింగ్‌లో రష్మిక హంగామా



యనిమే అభిమానుల కోసం క్రంచిరోల్, సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా సంయుక్తంగా 'డీమన్ స్లేయర్: కిమెట్సు నో యైబా ఇన్ఫినిటీ క్యాసిల్' సినిమాని రిలీజ్ చేస్తున్నాయి. సెప్టెంబరు 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే రీసెంట్‌గా ముంబైలో యనిమే అభిమానుల కోసం స్పెషల్ స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు. హీరోయిన్ రష్మిక, హీరో టైగర్ ష్రాఫ్ కూడా సందడి చేశారు. రష్మిక.. టాంజిరో, నెజుకో సోదర సోదరీమణులకి ప్రేరణగా ఉండే ప్రత్యేక జపనీస్ డ్రస్సులో కనిపించింది. రష్మిక కూడా అభిమానులను వారి ఫేవరెట్ సీన్ గురించి అడిగింది. దీనికి పెద్ద ఎత్తున స్పందన రావడంతో 'అకాజా vs గియు మరియు టాంజిరో' ఫైట్ సీక్వెన్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. మన దేశంలో దాదాపు 750కి పైగా స్క్రీన్స్‌లో ఈ సినిమా విడుదలవుతోంది. ఓ యనిమే మూవీకి ఇంతలా రిలీజ్ దక్కుతుండటం ఇదే మొదటిసారి అని చెప్పొచ్చు. తెలుగు డబ్బింగ్‌తోనూ ఈ మూవీ ఉండనుంది.

# రామ్ పోతినేని ఆంధ్ర కింగ్ తాలూకా.. పప్పీ షేమ్ సాంగ్ రిలీజ్



టాలీవుడ్ హీరో రామ్ పోతినేని నటిస్తోన్న లేటేస్ట్ మూవీ 'ఆంధ్ర కింగ్ తాలూకా'(Andhra King Taluka). ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే.. రామ్‌కు జంటగా నటిస్తోంది. ఈ మూవీకి మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 28న విడుదల కానుంది.

ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలోని పప్పీ షేమ్ అనే పాటను విడుదల చేశారు. అయితే ఈ సాంగ్‌ను రామ్‌నే ఆలపించడం విశేషం. ఆ పాటకు భాస్కరభట్ల లిరిక్స్ అందించహా.. వివేక్, మెర్విన్ కంపోజ్ చేశారు. కాగా.. ఈ సినిమాలో ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు.

# షారుఖ్ ఖాన్ కొడుకు డైరెక్షన్.. బాలీవుడ్ అంతా ఒకే సిరీస్‌లో




రాజమౌళి పేరు చెప్పగానే బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలు గుర్తొస్తాయి. ప్రస్తుతం మహేశ్ బాబుతో ఓ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేస్తున్నాడు. అదే టైంలో ఈ మధ్య కాలంలో యాడ్స్, ఈవెంట్స్‌లో తరుచుగా కనిపిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా ఓ హిందీ వెబ్ సిరీస్‌లోనూ జక్కన్న నటించడం విశేషం. తాజాగా రిలీజైన ట్రైలర్‌తో ఈ విషయం బయటపడింది.షారుఖ్ ఖాన్ కొడుకు ఆర్యన్.. దర్శకుడిగా మారి తీసిన సిరీస్ 'ద బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'. హిందీ చిత్రసీమలో తెరవెనక జరిగే సంగతుల్ని ఆధారంగా చేసుకుని కామెడీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీశాడు. సెప్టెంబరు 18 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇందులోనే ఓ సీన్‌లో ఆమిర్ ఖాన్, రాజమౌళి కనిపించారు. వీళ్లతో పాటు దర్శకనిర్మాత కరణ్ జోహార్, దిశా పటానీ, షారుఖ్ ఖాన్, ర్యాపర్ బాద్ షా కూడా అతిథి పాత్రల్లో కనిపించారు.

# ఆరోజు చిరంజీవి నా ఫొటో సెలక్ట్ చేసి ఉండకపోతే..: తేజ సజ్జా

సూపర్ యోధుడిగా కనిపించేందుకు తేజ సజ్జా సిద్ధమయ్యారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ ప్రధాన పాత్రలో నటించిన 'మిరాయ్' (Mirai) సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో తేజ సందడి చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ గురించి పంచుకున్నారు.''నేను చిన్నప్పుడు చాలా గొప్ప వ్యక్తుల మధ్య పెరిగాను. చిరంజీవి ఎప్పుడూ నన్ను సొంత పిల్లాడిలా చూసుకున్నారు. అందుకే ఆయనంటే నాకు అపారమైన గౌరవం. ఆయనకు ఉన్న టెన్షన్స్‌లోనూ సెట్‌లో ఉన్నవారి బాగోగులు చూస్తారు. 'హనుమాన్' చూశాక నాకు ఫోన్ చేసి సుమారు 20 నిమిషాలు మాట్లాడారు. భవిష్యత్తులో ఎలా ఉండాలో సలహాలు ఇచ్చారు. 'చూడాలని ఉంది' సినిమా చైల్డ్ ఆర్టిస్ట్‌ల కోసం వంద ఫొటోలు వచ్చాయి. వాటిలో నుంచి చిరంజీవి నన్ను సెలెక్ట్ చేశారు. ఆరోజు ఆయన నా ఫొటో సెలక్ట్ చేసి ఉండకపోతే ఈరోజు ఇక్కడ ఉండే వాడిని కాదు. అలా నా కెరీర్ ప్రారంభమైంది. మాకు సినీ నేపథ్యం లేకపోవడంతో పెద్దయ్యాక హీరో అవుతానంటే ఇంట్లో వాళ్లు చాలా భయపడ్డారు. నేను పట్టుదలతో వచ్చాను. 'ఓ బేబీ' సినిమా సమయంలో సమంత చాలా సపోర్ట్ చేశారు. ఆ సినిమా ప్రచారానికి కూడా నన్నే పంపేవారు. నా గురించి అందరికీ తెలియాలి అని వెళ్లిన ప్రతిచోట చెప్పేవారు''.

ఈ వారం థియేటర్‌లో థ్రిల్ పంచే చిత్రాలివే.. మరి ఓటీటీలో...!

''నేను హీరోగా ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అవమానాలు, తిరస్కరణలు, మోసాలు అన్నీ చూశాను. అన్ని ఒడుదొడుకులు చూశాను కాబట్టే నాపై నాకు నమ్మకం పెరిగింది. ఏ రంగంలోనైనా కష్టాలు ఉంటాయి. నన్ను మోసం చేసిన వాళ్లలో చాలామంది పెద్ద మనుషులు ఉన్నారు. ఒకసారి స్టార్ దర్శకుడు నాకు కథ చెప్పి షూటింగ్ ప్రారంభించారు. 15 రోజులు చిత్రీకరణ జరిగింది. ఒకరోజు హఠాత్తుగా ఆ సెట్‌స్‌కు మరో హీరో వచ్చాడు. ఆ సినిమాలో అతడు హీరో అని నాకు అప్పుడు అర్థమైంది. నాకు కథ చెప్పడం కంటే ముందే ఆ హీరోకు కథ చెప్పారు. అతడికి సీన్స్ చూపించడం కోసం నాతో మాక్ షూట్ చేశారని తర్వాత తెలిసింది'' అని చెప్పారు.



## బాలకృష్ణకు మరో గౌరవం.. ఆ ఆహ్వానం అందుకున్న తొలి దక్షిణాది నటుడు



ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ఖాతాలో మరో రికార్డు చేరింది. ముంబయిలోని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) బెల్‌ను మోగించిన తొలి దక్షిణాది నటుడిగా నిలిచారు. అధికారుల ఆహ్వానం మేరకు ఎన్ఎస్ఈని బాలకృష్ణ సందర్శించారు. వారి విజ్ఞప్తి మేరకు అక్కడ ఏర్పాటు చేసిన గంటను మోగించారు. సంబంధిత ఫొటోలు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ గౌరవంపై బాలకృష్ణ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితమే ఆయనకు 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 'లో చోటు దక్కిన సంగతి తెలిసిందే.

ఇండస్ట్రీలో మన అనే వాళ్లు ఉండరు.. ఎవరి స్వార్థం వాళ్లది: బెల్లంకొండ సాయి శ్రీనివాస్

ప్రస్తుతం బాలకృష్ణ కథానాయకుడిగా 'అఖండ 2: తాండవం' రూపొందుతోంది. బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రామ్ ఆచంట, గోపి ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. నిర్మాణాంతర పనుల్లో ఉన్న ఈ సినిమా డిసెంబరు తొలి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో నిండిన ఈ మాస్ యాక్షన్ చిత్రంలో బాలకృష్ణ రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీత దర్శకుడు.

# అఫీషియల్.. 46 ఏళ్ల తర్వాత కమల్, రజనీ మల్టీస్టారర్



కోట్ల మంది సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న మల్టీస్టారర్ అధికారికమైంది. ఇండస్ట్రీలో అగ్ర కథానాయకుల్లో ముందు వరుసలో ఉండే కమల్‌హాసన్, రజనీకాంత్‌లు ఇప్పుడు 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్‌పై కనిపించనున్నారు. వీరిద్దరి కాంబోలో మల్టీస్టారర్ రానుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాను కమల్‌హాసన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో వీరి అభిమానులు సంబరపడుతున్నారు.ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. 'మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా' అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. ''ప్రేక్షకులు మా కాంబినేషన్‌ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసి రానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది'' అని స్పష్టంచేశారు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ అధికారికమైంది . అయితే, ఈ ప్రాజెక్ట్ వివరాలు మాత్రం ఆయన పంచుకోలేదు.

బిగ్‌బాస్ సీజన్ 9: కంటెస్టెంట్‌లు వీళ్లే.. సర్‌ప్రైజ్‌లు ఇవే..!

ఇక వీరిద్దరి మధ్య అభిప్రాయబేధాలు ఉన్నాయంటూ వస్తోన్న వార్తలపై కూడా కమల్ స్పందించారు. ''మా మధ్య ఎలాంటి భేదాలు లేవు. ఇవన్నీ మీరు సృష్టించుకున్నవే. మేం ఎప్పుడూ ఒకరికి ఒకరం పోటీ అనుకోలేదు. మేమిద్దరం కలిసి నటించేందుకు అవకాశం కోసం ఎదురుచూశాం. ఒకరి సినిమాలు మరొకరం నిర్మించాలని కూడా ప్రయత్నం చేశాం'' అని కమల్ హాసన్ తెలిపారు.

లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వీరిద్దరి మల్టీస్టారర్ రానున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. లోకేశ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఓ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ కమల్ ఇద్దరూ గ్యాంగ్‌స్టర్లుగానే సందడి చేయనున్నారని కోలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ కమల్ మళ్లీ కలిసి కెమెరా ముందుకువచ్చినట్లవుతుంది. ఈ ఇద్దరూ కలిసి 5 భాషల్లో 20కి పైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970వ దశకంలోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకొనే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథలో వీరు సందడి చేయనున్నట్లు తెలుస్తోంది.

## పంజాబ్.. నన్ను అవమానించింది



దిల్లీ: కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్) జట్టులో తాను అవమానాలు ఎదుర్కొన్నట్లు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ అన్నాడు. 2018 2021 మధ్య పంజాబ్ తరఫున ఆడిన గేల్.. 41 మ్యాచ్‌ల్లో 40.75 సగటు, 148.65 స్ట్రైక్‌రేట్‌తో 1,304 పరుగులు సాధించాడు. బయో బబుల్‌లో జరిగిన 2021 సీజన్ నుంచి గేల్ అర్ధంతరంగా నిష్క్రమించాడు. "పంజాబ్‌తో నా ప్రయాణం కాస్త ముందుగానే ముగిసింది. కింగ్స్ ఎలెవన్‌లో నన్ను అవమానించారు. ఐపీఎల్‌కు ఎంతో చేసి.. లీగ్ విలువ పెంచిన సీనియర్‌తో సరిగ్గా వ్యవహరించలేదు. నన్ను ఓ పిల్లాడిలా చూశారు. నా జీవితంలో తొలిసారిగా నైరాశ్యంలోకి వెళ్లినట్లు అనిపించింది. అప్పటి చీఫ్ కోచ్ అనిల్ కుంబ్లేతో మాట్లాడుతూ ఏడ్చేశా. చాలా బాధపడ్డా. అతనితో, ఫ్రాంచైజీ తీరుతో తీవ్రంగా నిరాశ చెందినట్లు తెలిపా. కెప్టెన్ కేఎల్ రాహుల్ నాకు ఫోన్ చేశాడు. 'గేల్.. ఉండు. తర్వాతి మ్యాచ్‌లో ఆడతావు' అంటూ చెప్పాడు. మీ అందరికీ శుభాకాంక్షలు అంటూ బ్యాగ్ సర్దుకుని బయటకు వచ్చేశా" అని గేల్ వివరించాడు.

## ఐసీసీ అవార్డు రేసులో సిరాజ్




దుబాయ్: భారత స్టార్ ఫేసర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంథ్ రేసులో నిలిచాడు. ఆగస్టు నెలలో ప్రదర్శనకు గాను సిరాజ్ పేరును ఐసీసీ సిఫార్సు చేసింది. సిరాజ్‌తో పాటు ఇంగ్లాండ్ పేసర్ మాట్ హెన్రీ, వెస్టిండీస్ బౌలర్ జేడెన్ సీల్స్ అవార్డు రేసులో ఉన్నారు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శనతో సిరాజ్ అదరగొట్టాడు. అయిదు టెస్టుల్లో అత్యధికంగా 23 వికెట్లు పడగొట్టాడు. జూన్ చివర్లో మొదలై.. ఆగస్టు ఆరంభంలో ముగిసిన సిరీస్‌లో సిరాజ్ మొత్తం 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. "ఆగస్టులో సిరాజ్ ఒక్క టెస్టు మాత్రమే ఆడాడు. కానీ ఆ ఒక్క మ్యాచ్‌లో సిరాజ్ కనబరిచిన ప్రతిభ అవార్డు రేసులో నిలిచేందుకు సరిపోయింది. చివరి టెస్టులో 21.11 సగటుతో 9 వికెట్లు తీసిన సిరాజ్.. సిరీస్ 2-2తో డ్రా అవడంలో కీలకపాత్ర పోషించాడు" అని ఐసీసీ పేర్కొంది.

# భారత్‌కు ఎదురుందా!




**నేటి నుంచే ఆసియాకప్ టీ20 టోర్నీ**
**తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ × హాంకాంగ్**
**రాత్రి 8 నుంచిసోనీ టెన్ స్పోర్ట్స్‌లో**
**రేపు యూఏఈతో టీమ్‌ఇండియా పోరు**

ఆధిపత్యం కోసం ఆసియా జట్ల సై. ధనాధన్ సమరానికి వేళైంది. నేటి నుంచే ఆసియా కప్ టీ20 టోర్నమెంట్. ఎనిమిది జట్ల ఈ సమరంలో టీమ్ఇండియా తిరుగులేని ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో సూర్యకుమార్ సేన పోరు అత్యంత ఆసక్తి రేపుతోంది. మంగళవారం అఫ్గానిస్థాన్, హాంకాంగ్ మ్యాచ్‌తో టోర్నీ మొదలవుతుంది.

దుబాయ్

ఆసియా కప్‌లో టీమ్ఇండియా తిరుగులేని ఫేవరెట్ అంటే చిన్న మాటే. సూర్యకుమార్ బృందానికి మిగతా జట్లకు అంత తేడా ఉంది. ఆ జట్టు కప్పు అందుకోలేకపోతే ఆశ్చర్యమే. మంగళవారం టోర్నీ తొలి మ్యాచ్‌లో అబుదాబిలో అఫ్గానిస్థాన్, హాంకాంగ్ తలపడతాయి. కానీ కళ్లన్నీ దుబాయ్‌పైనే. ఎందుకంటే అక్కడ యూఏఈతో పోరుతో టీమ్ఇండియా తన టైటిల్ వేటను ఆరంభిస్తుంది. ప్రతిభావంతులతో బలంగా కనిపిస్తోన్న భారత్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. టీమ్ఇండియా ఎంత ఆత్మవిశ్వాసంతో ఉంది అంటే.. టోర్నీకి 17 మంది సభ్యులను ఎంపిక చేసే అవకాశమున్నా, అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మందినే ఎంపిక చేసింది. నాలుగున్నర నెలల్లో సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఆసియాకప్ గెలవలేకపోతే విమర్శలు తప్పవు. ప్రపంచకప్‌నకు ముందు సూర్య బృందానికి దాదాపు 20 మ్యాచ్‌లు (ఆసియాకప్ ఫైనల్ చేరితే) ఉన్నాయి. జట్టు కూర్పును సరిచూసుకోవడమే ఇప్పుడు భారత్ ముందున్న ప్రధాన లక్ష్యం. టీమ్ఇండియా ఎనిమిదిసార్లు ఆసియాకప్ (వన్డే, టీ20 ఫార్మాట్లలో)ను గెలుచుకుంది.

ఆపేదెవరు?

ఆసియాకప్‌ను ఎవరు గెలుస్తారు అన్నదాని కన్నా బలంగా ఉన్న భారత్‌ను ఎవరు అడ్డుకుంటారు అన్నదే ఎక్కువ చర్చనీయాంశం. పాకిస్థాన్, శ్రీలంకలు ఏమాత్రం ప్రతిఘటించగలవో చూడాలి. పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతోన్న బాబర్ అజామ్, రిజ్వాన్ పాకిస్థాన్ జట్టులో చోటు కోల్పోయారు. ఈ నేపథ్యంలో షహీన్ షా అఫ్రిది, రవూఫ్, హసన్ అలీ ఎలా బౌలింగ్ చేస్తారన్న దానిపైనే సల్మాన్ అఘా నేతృత్వంలోని పాక్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఇటీవల ముక్కోణపు సిరీస్ ఫైనల్లో 75 పరుగుల తేడాతో అఫ్గాన్‌ను ఓడించడం పాక్‌కు ఆత్మవిశ్వాసాన్నిచ్చే విషయం. చరిత్ అసలంక నేతృత్వంలోని శ్రీలంక జట్టు కూడా మరీ బలహీనంగా ఏమీ లేదు. కానీ టోర్నీలో ఆరేడు మ్యాచ్‌లు గెలిచే నిలకడ ఆ జట్టులో ఉందా అన్నదే ప్రశ్న. మరోవైపు బంగ్లాదేశ్ బలహీనంగా కనిపిస్తోంది. హాంకాంగ్ తర్వాత గ్రూప్‌బి నుంచి నిష్క్రమించే జట్టు అదే అయితే ఆశ్చర్యం లేదు. రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, ఘజన్‌ఫర్ రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు, బ్యాటింగ్ ఆర్డర్‌లో మంచి హిట్టర్లున్న అఫ్గానిస్థాన్.. శ్రీలంక తర్వాత ఈ గ్రూప్ నుంచి ముందంజ వేసే రెండో జట్టు కావొచ్చు.

కూనలు ఎలా ఆడతాయో..!

పసికూనలు హాంకాంగ్, ఒమన్‌లపై పెద్దగా అంచనాలేమీ లేవు. కానీ పెద్ద జట్లతో ఆడే అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటాయో చూడాలి. ప్రతిభను చాటుకోవడానికి ఆ జట్లకు ఇదో చక్కని అవకాశం. ఈ జట్లు గట్టి పోటీ ఇచ్చినా విశేషమే. యూఏఈ జట్టులో ఆరుగురు, ఒమన్ జట్టులో ఆరుగురు భారత సంతతి ఆటగాళ్లుండడం విశేషం.

ఫార్మాట్ ఇలా..

టోర్నీలో 8 జట్లను 2 గ్రూపులుగా విభజించారు. భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ గ్రూప్‌ఎలో, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంకాంగ్ గ్రూప్‌బిలో ఉన్నాయి. గ్రూప్‌లో ప్రతి జట్టు ఇంకో జట్టుతో ఒకసారి తలపడుతుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్4కు అర్హత సాధిస్తాయి. అందులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్లో అడుగుపెడతాయి.

ఈసారి ఆసియాకప్ బరిలో ఉన్న జట్లు. ఇన్ని జట్లు పోటీపడటం ఇదే తొలిసారి.

8

టీమ్ఇండియా గెలిచిన ఆసియాకప్‌లు. ఇప్పటివరకు 16 సార్లు ఈ టోర్నీ జరిగింది. 14 సార్లు వన్డే ఫార్మాట్లో, రెండు సార్లు టీ20 ఫార్మాట్లో టోర్నీని నిర్వహించారు.

429

ఆసియాకప్ టీ20 ఫార్మాట్లో కోహ్లి చేసిన పరుగులు. అతడే టాప్ స్కోరర్. 9 ఇన్నింగ్స్‌ల్లో అతడి సగటు 85.80.

# సూర్యకుమార్ కొడితే.. ఆసియా కప్ మనదే!



సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో టీమ్ఇండియా ఆసియా కప్ కోసం బరిలోకి దిగుతోంది. భారత జట్టు తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. గత ఆసియా కప్‌లోనూ సూర్యకుమార్ యాదవ్ మెరుగైన ప్రదర్శనే చేశాడు. కానీ, ఇటీవల జాతీయ జట్టు తరఫున మాత్రం మునుపటిలా ధారాళంగా పరుగులు చేయలేకపోయాడు. అయితే.. కెప్టెన్‌గా జట్టును విజయాల బాటలోనే నడిపించాడు. సూర్యకుమార్ యాదవ్.. అంతర్జాతీయంగా చివరి అయిదు టీ20ల్లో కేవలం 28 పరుగులే చేశాడు. అందులో రెండు డకౌట్లూ ఉన్నాయి. 2, 0, 14, 12, 0... ఇవీ ఆఖరి అయిదు టీ20ల్లో సూర్యకుమార్ యాదవ్ స్కోర్లు. అయితే ఐపీఎల్ (IPL) 2025 సీజన్‌లో మాత్రం సూర్యకుమార్ బ్యాట్‌తో మెరుగైన ప్రదర్శనే చేశాడు. వరుసగా అర్ధసెంచరీలతో వీర విహారం చేశాడు. తన జట్టు టైటిల్ గెలవలేకపోయినా.. సూర్య ఆట మాత్రం అదుర్స్.

సూర్య శివాలెత్తితే..

సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ కంటే కూడా బ్యాటింగ్‌పైనే దృష్టి పెడితే.. టీమ్ఇండియా కచ్చితంగా ఆసియాకప్‌ను సొంతం చేసుకుంటుందని సీనియర్ ఆటగాడు అజింక్య రహానే సైతం తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఆసియా కప్‌లోనూ సూర్య బ్యాటింగ్‌కు ఎక్కువ ప్రాముఖ్యమిస్తే.. అతడి బ్యాట్ నుంచి పరుగుల ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు. సూర్య శివాలెత్తితే.. ప్రత్యర్థులు బెంబేలెత్తడం ఖాయం. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో స్కై తేలిపోయాడు. కానీ, ఐపీఎల్‌లో మాత్రం ఏకంగా అయిదు హాఫ్‌సెంచరీలు చేశాడు. మొత్తంగా 717 పరుగులతో లీగ్‌లోనే రెండో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. స్ట్రైక్ రేట్ కూడా 167.91గా ఉంది. సూర్య ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే మాత్రం అతడెంత ప్రమాదకరమైన బ్యాటరో అందరికీ తెలిసిందే. అయితే ప్రస్తుతం సర్జరీ తర్వాత మైదానంలో అడుగు పెడుతున్న నేపథ్యంలో ఆసియా కప్‌లో ఎలా ఆడతాడనేదే ఆసక్తికరం. అయితే సరైన సమయంలో ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడితే చాలు.. సూర్య ఆత్మవిశ్వాసం అమాంతం పెరిగిపోతుందనేది కాదనలేని వాస్తవం.

ఆసియా కప్.. ఇదిగో వీరే హాట్ టాపిక్!

టీమ్ఇండియానే ఫేవరెట్..

క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎవరూ చెప్పలేరు. ముఖ్యంగా టీ20ల్లో! అందుకే సూర్యకుమార్ ఆసియా కప్‌లో రాణించడం తప్పనిసరి. గ్రూప్ Aలో టీమ్ఇండియా, పాకిస్థాన్, యూఏఈ, ఒమన్ జట్లున్నాయి. గ్రూప్ Bలో శ్రీలంక, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్ జట్లు ఉన్నాయి. అయితే గ్రూప్ Aలో టీమ్ఇండియానే బలంగా కనిపిస్తోంది. గ్రూప్ దశలో భారతజట్టుకు పెద్దగా సవాళ్లు ఎదురయ్యే అవకాశం లేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లోనూ టీమ్ఇండియానే ఫేవరెట్ కాబట్టి పెద్దగా ఇబ్బంది లేదు. ముఖ్యంగా ఆసియా కప్‌లో చక్కగా రాణించే శ్రీలంక, సంచలనాలకు మారుపేరైన అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్ గ్రూప్ Bలో ఉండటం టీమ్ఇండియాకు కాస్త కలిసొచ్చే అంశం. ఈ నేపథ్యంలో గ్రూప్ స్టేజీ పూర్తయ్యేలోపు సూర్యకుమార్ తన రిథమ్‌ను అందుకుంటే.. ఇక భారత జట్టుకు తిరుగే ఉండదు.

సూర్యకుమార్ యాదవ్ సైతం ఆసియా కప్‌లో రాణించడాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాడు. అందుకే రాబోయే రోజుల్లో తనలోని అత్యుత్తమ ఆటగాడిని చూస్తారని అతడు ఆత్మవిశ్వాసంతో ప్రకటించాడు. టీమ్ఇండియా అభిమానులు సైతం.. సూర్యకుమార్ యాదవ్.. ఐపీఎల్ 2025లో మాదిరి ఆసియాకప్‌లోనూ రాణించాలని కోరుకుంటున్నారు.

# బెంగళూరు దూకుడు



విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రొ కబడ్డీ సీజన్-12లో బెంగళూరు బుల్స్ బలంగా పుంజుకుంది. మూడు ఓటముల తర్వాత వరుసగా రెండో విజయాన్ని సాధించింది. సోమవారం ఆ జట్టు 40-33తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. ఆట ఆరంభం నుంచి బెంగళూరు దూకుడు ప్రదర్శించింది. తొలి అయిదు నిమిషాల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 9-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. విరామ సమయానికి స్కోరు 21-18తో బెంగళూరు ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో అలీరెజా విజృంభించడంతో బెంగళూరుకు ఎదురులేకపోయింది. ఆఖరిదాకా మెరుగైన ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వెళ్లిన ఆ జట్టు ఘన విజయాన్ని అందుకుంది. అలీరెజా (12), యోగేశ్ (6), దీపక్ (5), ఆశిష్ (5) జట్టును గెలిపించారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-37తో పుణెరి పల్టాన్‌ను ఓడించింది.

# ఆసియా అందె.. ఆశలు చిగురించె..



భారత హాకీకి ఇది శుభపరిణామమే. తిరుగులేని ఆటతో ఎనిమిదేళ్ల తర్వాత తొలిసారి ఆసియాకప్‌ను చేజిక్కించుకున్న భారత జట్టు.. ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించింది. పూర్తి ఫామ్‌ను అందుకుంటూ టోర్నీలో భారత్ విజయాలు సాధించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ఇదే జోరు కొనసాగిస్తే ప్రపంచకప్‌లోనూ మంచి ఫలితాన్ని ఆశించొచ్చు.

ఆసియాకప్ గ్రూప్ దశలో కాస్త అస్థిరంగా ఆడిన భారత్.. సూపర్ 4లో ఒత్తిడిలో నిలిచిన తీరు అద్భుతం. డిఫెండింగ్ ఛాంపియన్ కొరియాను ఫైనల్లో 41తో ఓడించడం ఆ జట్టు తిరుగులేని ఆధిపత్యానికి నిదర్శనం. చాలా కాలం తర్వాత భారత్ ఎలాంటి తడబాటు లేకుండా ఇలాంటి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. డిఫెన్స్, ఎటాకింగ్, మిడ్‌ఫీల్డ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ సూపర్‌గా ఆడిన భారత్, వచ్చే ఆగస్టులో జరిగే ప్రపంచకప్‌లో అవకాశాలపై ఆశలను రేపింది. ఆసియాకప్‌లో కన్నా ఆ టోర్నీలో పోటీ చాలా తీవ్రంగా ఉంటుందనడంలో సందేహం లేదు. కానీ ఆసియాకప్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించిన తీరు కచ్చితంగా భారత జట్టు విశ్వాసాన్ని పెంచేదే.

ఫలితాన్నిచ్చిన మార్పులు!: ప్రొ లీగ్‌లో ఐరోపా అంచెలో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఏడు ఓడిన నేపథ్యంలో ఆసియాకప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు.. నెమ్మదిగా ఆరంభించింది. క్రమంగా పుంజుకుని.. ప్రతి మ్యాచ్‌కూ మెరుగవుతూ పోయింది. పూల్ దశలో చైనా (43), కొరియా (32)లను ఓడించడానికి కష్టపడ్డ హర్మన్‌ప్రీత్ బృందం.. కజకిస్థాన్‌ను 150తో ఓడించి జోరందుకుంది. సూపర్ 4లో కొరియా మ్యాచ్ (22) భారత్‌ను మళ్లీ పరీక్షించింది. అయితే ఆ తర్వాత మలేసియాను 41తో, చైనాను 70తో చిత్తు చేసి టాప్ ఫామ్‌ను అందుకుంది. ఫైనల్లో కొరియాను చిత్తు చేస్తూ టోర్నీని ఘనంగా ముగించింది. మరి టీమ్ఇండియా మెరుగైన ప్రదర్శనకు కారణమేంటి? కొందరు సీనియర్ ఆటగాళ్లను తప్పించి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం సత్ఫలితాలనిచ్చింది. ప్రపంచకప్, ఆసియా గేమ్స్ నేపథ్యంలో మరిన్ని మార్పులు తప్పకపోవచ్చు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులోని ముగ్గురు ఆటగాళ్లు షంషేర్ సింగ్, గుర్జంత్ సింగ్, నీలకంఠ శర్మలను తప్పించి మిడ్‌ఫీల్డర్ రాజిందర్ సింగ్, స్ట్రైకర్ శిలానంద్ లక్రాలకు అవకాశం కల్పించారు. ఈ ఎత్తుగడ ఫలించింది. ఈ కుర్రాళ్లిద్దరూ చెరో గోల్ మాత్రమే చేసినప్పటికీ తమ ఆటతో ఆకట్టుకున్నారు. సుఖ్‌జీత్ సింగ్ (6 గోల్స్), 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అభిషేక్ (6), దిల్‌ప్రీత్ (4), వెటరన్ డిఫెండర్ అమిత్ రోహిదాస్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్ కూడా గొప్పగా ఉంది. వేడి ఉక్కపోత పరిస్థితుల్లో భారత జట్టు 10 రోజుల వ్యవధిలో ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లు ఏడు ఆడడం వాళ్ల అద్భుత ఫిట్‌నెస్‌కు నిదర్శనం. భారత జట్టు డిఫెన్స్, మిడ్‌ఫీల్డ్, ఫార్వర్డ్ మధ్య సమన్వయం కూడా బాగా మెరుగుపడడం సంతోషాన్నిచ్చే విషయమే. గోల్‌కీపింగ్‌లోనూ మెరుగుపడి, భారత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే ప్రపంచకప్‌లో మెరుగైన ఫలితాలను సాధించొచ్చు.

# అల్కరాస్ పట్టేశాడు



కార్లోస్ అల్కరాస్‌యానిక్ సినర్ మధ్య రికార్డు స్థాయిలో అయిదు గంటలకు పైగా సాగింది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్.. వింబుల్డన్ తుదిపోరు కూడా నువ్వానేనా అన్నట్లే జరిగింది.. యుఎస్ ఓపెన్లోనూ అదే స్థాయి పోరాటం ఊహించారు అభిమానులు. కానీ ఫ్లషింగ్ మెడోస్‌లో అల్కరాస్.. డిఫెండింగ్ ఛాంపియన్ సినర్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. దూకుడుకు క్లాస్‌ను జత చేర్చి ట్రోఫీ ఎగరేసుకుపోయాడు. కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో చేర్చుకున్నాడు. యుఎస్ ట్రోఫీ విజయంతో సినర్ నుంచి అల్కరాస్ నంబర్‌వన్ ర్యాంకును కూడా లాగేసుకున్నాడు.

న్యూయార్క్

అల్కరాస్‌కు తిరుగేలేదు.. అదిరే ప్రదర్శన చేసిన ఈ స్పెయిన్ కుర్రాడు యుఎస్ ఓపెన్ ఛాంపియన్ అయ్యాడు. పురుషుల సింగిల్స్ తుదిపోరులో ఈ రెండో సీడ్ ఆటగాడు 62, 36, 61, 64తో ప్రపంచ నంబర్‌వన్, టాప్‌సీడ్ సినర్ (ఇటలీ)ని ఓడించాడు. వర్షం కారణంగా స్టేడియం పైకప్పు మూసి ఆడించిన ఈ ఫైనల్లో అల్కరాసే ఎక్కువ శాతం ఆధిపత్యం ప్రదర్శించాడు. బంతిని బలంగా కొడుతూ.. క్రాస్‌కోర్టు షాట్లతో సినర్‌ను ఇబ్బంది పెట్టాడు. తొలి సెట్ నుంచే అతడి దూకుడు మొదలైంది. రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన అల్కరాస్ 52తో ఆధిక్యంలో నిలవడమే కాక.. అదే జోరుతో సెట్ గెలిచాడు. రెండో సెట్లో సినర్ పుంజుకున్నాడు. షాట్లలో పదును పెంచాడు. ముఖ్యంగా నెట్ గేమ్‌లో అదరగొట్టాడు. అల్కరాస్ నుంచి పోటీ ఎదురైనా.. సినర్ ఈ సెట్ గెలిచి స్కోరు సమం చేశాడు. మ్యాచ్‌లో సినర్ హవా ప్రదర్శించింది ఆ కొద్ది సమయమే! ఆ తర్వాత ఆటంతా అల్కరాస్‌దే. ఈ స్పెయిన్ కుర్రాడు కచ్చితమైన సర్వీసులు, బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లకు సినర్ బదులీయలేకపోయాడు. మూడో సెట్లో 30తో నిలిచిన అల్కరాస్.. అదే జోరుతో సెట్ గెలిచి మళ్లీ ఆధిక్యంలో నిలిచాడు. గతంలో ఇలాంటి పరిస్థితుల్లో పుంజుకున్న సినర్ ఈసారి సత్తా చాటలేకపోయాడు. మూడో సెట్‌తో పోలిస్తే నాలుగో సెట్లో అతడు మెరుగ్గానే ఆడినా.. అల్కరాస్ దూకుడు ముందు అది పని చేయలేదు. ఒక షాట్‌ను సినర్ కోర్టు బయటకు కొట్టడంతో అయిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన అల్కరాస్ 32తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత 54తో విజయానికి చేరువయ్యాడు. అల్కరాస్ సర్వీస్‌లో సినర్ 4040తో నిలవడంతో మ్యాచ్ మలుపు తిరుగుతుందేమో అనిపించింది. అయితే అల్కరాస్ తగ్గలేదు. చకచకా రెండు పాయింట్లు సాధించి మ్యాచ్‌తో పాటు ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. ఓ షాట్‌ను సినర్ అందుకోలేకపోవడంతో అల్కరాస్ సంబరాల్లో మునిగిపోయాడు. ఈ మ్యాచ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అతిథిగా హాజరయ్యారు. ట్రంప్ రాకతో భద్రతను పెంచడంతో మ్యాచ్ కాస్త ఆలస్యంగా మొదలైంది.

''వింబుల్డన్‌లో సినర్ నాపై పైచేయి సాధించాడు. ఆ మ్యాచ్‌లో చేసిన తప్పులు దిద్దుకున్నా. నా శైలిలో ఆడి యుఎస్ ఓపెన్ గెలిచా''

అల్కరాస్

''ఫైనల్లో పూర్తి స్థాయిలో రాణించేందుకు ప్రయత్నించా. ఈరోజు అల్కరాస్ స్థాయిని అందుకోలేకపోయా. అతడు పరిస్థితికి తగ్గట్టుగా ఆడాడు. నాకన్నా ఉత్తమ ప్రదర్శన చేశాడు. అన్ని రకాల షాట్లు ఆడాడు''

సినర్

యుఎస్ ఓపెన్ గెలిచిన అల్కరాస్ రూ.44 కోట్లు ప్రైజ్‌మనీగా అందుకున్నాడు. రన్నరప్‌గా నిలిచిన సినర్‌కు రూ.27 కోట్ల 99 లక్షలు లభించాయి.